TELTEL/2023/88710
తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
www.telangananamuchatlu.in






వరంగల్ సంపుటి : 2 సంచిక : 35 శుక్రవారం 18 - 10 - 2024 పేజీలు : 08 వెల : 5 www.telanganamuchatlu.in

## బిఆర్ఎస్ తెలంగాణ అస్తిత్వ పార్టీ

- తెలంగాణ కోసం కొట్లాడేది కేవలం మన పార్టీయే
- ఇది కెసిఆర్, కెటిఆర్‌దో కాదు...తెలంగాణ ప్రజలది
- కాంగ్రెస్ పాలనలో దోపిడీ పెరిగింది
- బిజెపి మత రాజకీయాలు చేస్తోంది
- బిఆర్ఎస్‌వి సమావేశంలో కెటిఆర్ విమర్శలు



హైదరాబాద్, (అక్టోబర్ 17) : రేవంత్ రెడ్డి ఉడుత ఊపులకు భయపడే ప్రసక్తే లేదు.. ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం బంద్ అయితే.. సమాజం తరపున కొట్లాడడం బంద్ అయితే.. పేద ప్రజల తరపున మాట్లాడడం బంద్ అయితే తెలంగాణ మూగబోతది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎందుకంటే బీజేపోడు మాట్లాడడు. తెలంగాణన నాశనం చేసిన బీజేపోడు మెసలడు. బడే భాయ్ చోటే భాయ్ ఒక్కటే. పైననేమో జూమ్లా పీఎం.. ఇక్కడ్నేమో హౌలా సీఎం.. ఈయనకు ఏం తెల్వది.. ఆగమాగం అవుతున్నాడని కేటీఆర్

మిగతా 2లో...

## మూసీ సుందరీకరణ కాదు... మూసీ నది పునరుజ్జీవం

- మూసీ మురికి నుంచి పేదలను కాపాడుతాం
- మూడు నెలలు కెటిఆర్, హరీస్, ఈటెల అక్కడ ఉంటారా
- వారికి సకల సౌకర్యాలు కలిగంచి ఉంచుతాం
- పేదలను తరిమి కొట్టేంత దుర్మార్గం చేయలేదు
- మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ బాధితులను హింసించింది మరిచారా
- మీడియా సమావేశంలో వివరణ ఇచ్చిన సిఎం రేవంత్







హైదరాబాద్, (అక్టోబర్ 17) : తాము చేపడుతున్నది మూసీ సుందరీకరణ కాదు.. మూసీ నది పునరుజ్జీవనమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. దీనిని వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న పార్టీలపై ఆయన ఆగ్రమం వ్యక్తం చేశారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మూసీనది అభివృద్ధి ప్రాజెక్టు వివరాలు వెల్లడించారు. 'మూసీ దుర్గంధంలో మగ్గిపోతున్న వారికి మెరుగైన జీవితం ఇవ్వాలని ఈ ప్రాజెక్టు తలపెట్టామని అన్నారు. నగరం మధ్య గుండా నది వెళ్తున్న రాజధాని మరొకటి ఈ దేశంలో లేదు. దాదాపు 300 కి .మీ ప్రవహించే మూసీకి ఎంతో చరిత్ర, విశిష్టత ఉంది. మేం చేపడుతున్నది మూసీ సుందరీకరణ కాదు.. మూసీ నది పునరుజ్జీవం. కొందరు మెదడులో మూసీలో ఉన్న మురికికంటే ఎక్కువ విషం నింపుకొన్నారు. మెదడులో విషం నింపుకొని మూసీ ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ పరివాహక ప్రజలకు మంచి జీవితం ఇవ్వాలనేది ఈ ప్రభుత్వ ఆలోచన. మల్లన్న సాగర్, వేములఘాట్‌లో ఏం జరిగిందో గుర్తు తెచ్చుకోవాలి. రాత్రికి రాత్రే

మిగతా 2లో

## పత్తి మద్దతు ధరలపై మండిపడ్డ హరీష్ రావు



హైదరాబాద్, (అక్టోబర్ 17) : తెలంగాణ రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపు తోందని భారాస నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. పత్తికి కేంద్రం చెల్లించే మద్దతు ధర ఒక్కో రాష్ట్రంలో ఒక్కోవిధంగా ఎందుకు ఉందని ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేశారు. ఒకే దేశం-ఒకే పన్ను, ఒకే దేశం- ఒకే ఎన్నిక, ఒకే దేశం- ఒకే రేషన్ అంటూ ఊదరగొట్టే కేంద్ర ప్రభుత్వం.. ఒకే దేశం- ఒకే కనీస మద్దతు ధర ఎందుకు ఇవ్వడం లేదు. నాణ్యమైన పత్తిని పండిస్తున్న తెలంగాణ రైతు పట్ల ఎందుకీ వివక్ష?

మిగతా 2లో...




## వాల్మీకి జీవితాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

అమరావతి (అక్టోబర్ 17) : వాల్మీకి జీవితాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, హైందవ ధర్మాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ చదివి అర్థం చేసుకోవలసిన ఇతిహాసం రామాయణం అని, మన వ్మాయంలో ఆదికావ్యంగా నిలిచిన

2 లో

## సీఎంను పొగుడుకుంటూనే షాకింగ్ కామెంట్స్ చేసిన షర్మిల

అమరావతి, (అక్టోబర్ 17) : ఏపీలో కూటమి ప్రభుత్వంపై ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల ముందు పథకాల పేరుతో మభ్యపెట్టి.. అధికారం చేపట్టాక ఆ హామీలను అమలు చేయడం లేదన్నారు. గురువారం విజయవాడలో మీడియాతో మాట్లాడిన వైఎస్ షర్మిల.. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

వైఎస్ షర్మిల కామెంట్స్ యధావిధిగా..

మిగతా 2లో...



## నేతన్నలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్

- నాలుగు నెలలైనా అమలుకు నోచని హామీ

విజయవాడ, (అక్టోబర్ 17) : దసరా పండుగకు చేనేత సొసైటీల్లో వస్త్ర విక్రయాలకు ప్రభుత్వ ప్రోత్సాహం అందిస్తుందని ఆశించిన నేతన్నలకు నిరాశే మిగిలింది. పండుగకు ఇచ్చే రిబేటుపై ప్రభుత్వం ఎటువంటి ప్రకటనా చేయలేదు. దీంతో సాదాసీదాగానే వస్త్ర వ్యాపారం సాగింది. 200

2లో



## చెన్నైకి భారీ వర్ష సూచన

- ఇల్లను వదిలి హోటళ్లు చూసుకుంటున్న జనం

చెన్నై, (అక్టోబర్ 17) : చెన్నై నగరవ్యాప్తంగా అత్యంత భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రజల్లో భయం పెరిగింది. ప్రత్యేకించి ఐటీ నిపుణులు, ధనవంతుల్లో చాలామంది విలాస వంతమైన హోటళ్లలో గదులు బుక్ చేసుకుని కుటుంబాలతో కలిసి దిగిపోతున్నారు. గతేడాది

మిగతా 2లో...

## పొన్నవోలుకు ఏబీఎన్ ప్రతినిధి షాక్




ఏపీ ప్రభుత్వ మాజీ అడిషనల్ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ రెడ్డి మంగళగిరి పోలీస్ స్టేషన్ వద్ద హైడ్రామాకు తెరలేపారు. టీడీపీ కార్యాలయం పై దాడి కేసులో పోలీసులు

2 లో

## సుప్రీం తదుపరి చీఫ్ జస్టిస్‌గా సంజీవ్ ఖన్నా

- కేంద్రానికి సిఫార్సు చేసిన సిజెఐ డివై చంద్రచూడ్



న్యూఢిల్లీ, (అక్టోబర్ 17) : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పదవీకాలం నవంబర్ 10తో ముగియ నుంది. దాంతో తన తరువాత సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా పేరును ఆయన కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించారు. సుప్రీం కోర్టులో చంద్రచూడ్ తర్వాత సీనియర్ జడ్జిగా ఖన్నా ఉన్నారు. జస్టిస్ చంద్రచూడ్ సిఫార్సులను కేంద్రం ఆమోదిస్తే 51వ భారత ప్రధాన న్యాయమూర్తిగా సంజీవ్ ఖన్నా నియమితులు కానున్నారు. నియమితులైతే

మిగతా 2లో...

తెలంగాణ TELANGANA MUCHATLU
TELTEL12273
ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక



# సంపాదకీయం

## హర్యానా పాఠం అందకపోతే, 'మహా' ప్రమాదం!

మధ్యలో ఆటంకాలు వస్తాయేమో అని కొందరు పనులు మొదలు పెట్టనే పెట్టరట. వీళ్లు అధములట. మొదలుపెట్టాక, చిన్న విఘ్నం రాగానే తోకముడిచేవాళ్లుంటారు, వాళ్లు మధ్యరకం వాళ్లు. ఇక, ఆరునూరైనా అవరోధాలు ఎన్ని ఎదురైనా ఉత్తములు మాత్రం పనిపూర్తిచేస్తారట. భర్తృహరి నీతులు చాలా చెప్పాడు కానీ, పని మొదలుబెట్టి, చిన్న విజయం రాగానే అదే మహద్భాగ్యం అనుకుని, కాడిపడేసే వాళ్ల గురించి మాత్రం రాయలేదు. అప్పటికింకా కాంగ్రెస్ పార్టీ పుట్టలేదు కాబట్టి, ఆ బాపతు మనుషుల గురించి ఆ కవికి తెలియకపోయి కూడా ఉండవచ్చు.

బుధవారం నాడు శ్రీనగర్‌లో ఒమర్ అబ్దుల్లా ప్రమాణస్వీకారానికి హాజరయిన రాహుల్‌గాంధీని, ఆయన సోదరిని, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేని చూసినప్పుడు, వారి మీద అపారమయిన జాలి కలిగింది. మొన్నటి ఎన్నికల్లో వారికి దొరికింది ఒక పావుశేరు గెలుపు మాత్రమే. అంత మాత్రానికే వారి ముఖాలు వెలిగిపోతున్నాయి. హర్యానా జారిపోయింది. జమ్మూకశ్మీర్‌లో గెలుపు ఏదైనా ఉందంటే, అది కూడా నైతికమయిన గెలుపు, నేషనల్ కాన్ఫరెన్స్‌ది మాత్రమే. జమ్మూ ప్రాంతంలో కాంగ్రెస్ ఘోరంగా ఓడిపోయింది. కేంద్రపాలిత ప్రాంతం మొత్తం మీద బీజేపీ బాగా పుంజుకున్నది. ప్రభుత్వంలో చేరకుండా కాంగ్రెస్ కొంత పరువు దక్కించుకున్నది కానీ, ఆ ప్రభుత్వం మాత్రం ఏ పాటిది? గవర్నర్ కనుసన్నలలో వ్యవహరించవలసివచ్చే జీహుజూర్ సామంతం! మరి, ఈ కాంగ్రెస్ అల్పసంతోషులు రేపు మహారాష్ట్రలో గట్టి పోటీ ఇస్తారా? జార?ండ్‌లో తమ కూటమిని గెలిపించుకుంటారా? వచ్చే ఏటికి బిహార్‌లో బలపడతారా? లేక, భారం అంతా తమతో పాటు నడిచే మిత్రపక్షాల మీదికి తోసి, నిమ్మకు నీరెత్తుతారా? తమకు కాస్త బలం పెరిగేసరికి, ఏ పొత్తూ వద్దని ఫోజు కొట్టి, హర్యానాలో గర్వభంగం జరిగిన కాంగ్రెస్, మహారాష్ట్రలో శివసేన, ఎన్సీపీతో సవ్యంగా కలసి నడుస్తుందా? పోయిన ఏడాది కర్ణాటకలో బీజేపీ మీద ముఖాముఖి ఘనవిజయం సాధించేసరికి కాంగ్రెస్ గాల్లో తేలిపోసాగింది. బీఆర్ఎస్ ప్రభుత్వ వ్యతిరేకతకు తోడు, కాంగ్రెస్‌కు సానుకూలత కూడా పెరుగుతోందని తెలిసినా, పరిస్థితిని పూర్తి అనువుగా మలచుకోవడంలో అగ్రనాయకత్వం సమర్థత అంతంత మాత్రంగానే ఉండడంతో, బొటాబొటి మెజారిటీతో తెలంగాణలో అధికారం దక్కించుకుంది. వరుస బీజేపీ పాలనల తరువాత, ప్రత్యామ్నాయానికి సిద్ధంగా కనిపించినప్పటికీ, మధ్యప్రదేశ్ ఓటర్లను కాంగ్రెస్ ఆకట్టులేకపోయింది.

## బిఆర్ఎస్ తెలంగాణ అస్తిత్వ పార్టీ

మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్వీ సమావేశంలో కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు దోచుకోవడంలో బిజీగా ఉన్నారు. ఇటీవలే ఓ బిల్డర్ తనకు వద్దకు వచ్చి.. హైదరాబాద్‌లో కరెంట్ కనెక్షన్ కోసం 25 లక్షలు సమర్పించుకున్నట్లు చెప్పాడు. కాంగ్రెస్ నేతలు అందినకాడికి దోచుకుంటున్నారని కేటీఆర్ మండిపడ్డారు. గత పది నెలల్లో అత్యంత కష్టకాలాన్ని ఎదుర్కొన్నాం. ఎవరూ ఊహించని విధంగా అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాం. ప్రతిపక్షంలో కూర్చుంటామని ఊహించలేదు. డిసెంబర్ 7న కేసీఆర్‌కు ప్రమాదం జరగడం.. మూడు నెలల పాటు ఇబ్బందికి గురయ్యారు. ఓ పది మంది ఎమ్మెల్యేలు ప్రలోభాలతో దొంగల్లో కలిసిపోయారు. మన ఆడబిడ్డ కవితమ్మను ఐదున్నర నెలలు జైల్లో పెట్టారు. ఇలాంటి పరిస్థితుల్లో కొట్లాడినం, పోరాడినం కానీ ఎవరికీ లొంగలేదు. పార్లమెంట్ ఎన్నికల్లో ఊహించిన దానికి భిన్నంగా ఫలితాలు వచ్చాయి. ఇవాళ కేసీఆర్‌ను తలచుకుంటున్నారు. కేసీఆర్ సీఎంగా ఉంటే రైతుబంధు, బతుకమ్మ చీరలు వస్తుండే అని అనుకుంటున్నారు. కులమతాలకు అతీతంగా కేసీఆర్‌ను తలచుకుంటున్నారని కేటీఆర్ తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అంటే కేసీఆర్‌దో, కేటీఆర్‌దో కాదు.. ఇది తెలంగాణ ప్రజల గొంతుక అని కేటీఆర్ స్పష్టం చేశారు. స్వీయ రాజకీయ అస్తిత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష.. కేసీఆర్ నాయకత్వం, గులాబీ జెండానే తెలంగాణకు రక్షణ. ఈ పార్టీ మరో 75 ఏండ్ల పాటు ఒక డీఎంకే లాగా, శిరోమణి అకాలీదళ్ లాగా ఉంటది. ఈ పార్టీ మన తెలంగాణ ప్రజలది అని కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలతో మనం జాగ్రత్తగా ఉండాలి. కాంగ్రెస్‌నే శత్రువుగా చూడాల్సిన అవసరం లేదు. తెలంగాణ సమాజానికి మరింత డేంజరస్ పార్టీ బీజేపీనే. మతాలను అడ్డంపెట్టుకుని, మతపరమైన రాజకీయాలు చేస్తూ దేవుడిని అడ్డుపెంట్టుకుని పిల్లలను రెచ్చగొడుతున్నారు. తెలంగాణకు చేసిందేమీ లేదు బీజేపీ. ఐఐటీ, ఐఐఎం, మెడికల్, నర్సింగ్ కాలేజీ ఇవ్వలేదు. ఆఖరికి ఒక్క నవోదయ పాఠశాల కూడా ఇవ్వలేదు. తెలంగాణకు ఏం ఇచ్చారని అడిగితే ఎవరు చెప్పరు.. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌కు మాటలు రావు. కానీ పిల్లలను అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నారు. ఇక రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని అన్ని వర్గాలను మోసం చేశారని కేటీఆర్ ధ్వజమెత్తారు. 32 జిల్లాల్లో పార్టీ ఆఫీసులు ఉన్నాయి.

## పత్తి మద్దతు ధరలపై మండిపడ్డ హరీష్‌రావు

గుజరాత్ పత్తికి మద్దతు ధరగా క్వింటాకు రూ.8,257 చెల్లిస్తున్న కేంద్రంతెలంగాణకు రూ.7,521 మాత్రమే ఇవ్వడం దుర్మార్గం. గుజరాత్‌కు ఒక నీతి, తెలంగాణకు ఒక నీతా? అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## వాల్మీకి జీవితాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

రామాయణాన్ని సంస్కృతంలో రచించి భారతావనికి అందించిన మహనీయుడు వాల్మీకి అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. గురువారం వాల్మీకి జయంతి సందర్భంగా ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పవన్ అమరావతిలో మీడియాతో మాట్లాడుతూ.. త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడి జీవితాన్ని, పరిపాలనను కళ్ళకు కట్టే రామాయణం ప్రజలకు నైతిక వర్తనను వెల్లడిస్తుందని, ధర్మాన్ని అనుసరించి ఎలా జీవించాలో దిశానిర్దేశం చేస్తుందన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వాల్మీకి ఋషి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తోందన్నారు. రామాయణ మహా కావ్యాన్ని మానవాళికి అందించిన వాల్మీకి జీవితాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, వేటగాడైన రత్నాకరుడు తారక మంత్రోపదేశం పొంది వాల్మీకిగా మారి రామాయణ కావ్యాన్ని రచించిన క్రమాన్ని తెలుసుకొంటే ఆధ్యాత్మిక జ్ఞానం విలువ తెలుస్తుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. వాల్మీకి జయంతి సందర్భంగా దైవ చింతన కలిగే ప్రతి ఒక్కరికీ, వాల్మీకిని ఆరాధించేవారందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

కాగా యువగళం పాదయాత్రలో టీడీపీ యువనేత, మంత్రి లోకేశ్ ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చింది. బీసీల ఆత్మగౌరవానికి పెద్దపీట వేస్తూ వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు బీసీ సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ నెల 17న వాల్మీకి జయంతి సందర్భంగా అన్ని జిల్లాల్లోనూ జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహించాలని పేర్కొంది. వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని యువగళం పాదయాత్రలో లోకేశ్‌కు అప్పట్లో భారీ సంఖ్యలో వినతులు అందాయి. ఈ నేపథ్యంలో బీసీల ఆత్మగౌరవానికి ప్రాముఖ్యతనిస్తూ అప్పట్లో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. యువగళం పాదయాత్రలో తాను ఇచ్చిన మరో హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం నెరవేర్చిందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని బోయ, వాల్మీకి సోదరులు యువగళం పాదయాత్రలో తనను కలిసి విన్నవించారన్నారు. వారి సెంటిమెంటును గౌరవిస్తూ వాల్మీకి జయంతిని ఈనెల 17వ తేదీన అన్ని జిల్లా కేంద్రాల్లో అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.

## నేతన్నలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్

యూనిట్లలోపు విద్యుత్ వినియోగించుకున్న నేతన్నలకు ఉచితంగా విద్యుత్ అందిస్తామని కూటమి నేతలు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. అయితే టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలవుతున్నా ఈ హామీ అమలుకు నోచుకోలేదు. మరోపక్క రిబేటు, యార్న్ సబ్సిడీ పాత బకాయిలను ప్రభుత్వం విడుదల చేయలేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూడా అమలు చేయకపోవడంతో నేతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, రాష్ట్ర విభజన తర్వాత 2014-19 మధ్యకాలంలోనూ చేనేత వస్త్ర ఉత్పత్తుల అమ్మకాలను ప్రభుత్వాలు ప్రోత్సహించాయి. పండుగల రోజుల్లో సొసైటీల్లో వస్త్ర విక్రయాలపై 30 శాతం రిబేటు ప్రకటించాయి. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేనేత వస్త్ర విక్రయాలకు ప్రభుత్వాలు ఇచ్చే ప్రోత్సాహాలను, సొసైటీలకు విడుదల చేయాల్సిన రాయితీ బకాయిలను నిలిపివేసింది. తాజాగా టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఏడాది జూలై 13న రాష్ట్ర బిసి సంక్షేమం, చేనేత, టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి ఎస్.సవిత కృష్ణాజిల్లా పెడన, గూడూరు మండలాల్లో పర్యటించి ప్రసిద్ధి చెందిన చేనేత సొసైటీలను పరిశీలించారు. నేతన్నలను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ప్రకటించారు. దీంతో గత టిడిపి హయాంలోలాగా సొసైటీల్లో వస్త్ర విక్రయాలపై పండుగలకు ప్రభుత్వం 30 శాతం రిబేటు ప్రకటిస్తుందని, తద్వారా ఈ ఏడాది వస్త్ర వ్యాపారం పెరుగుతుందని ఆశించిన వారికి నిరాశే మిగిలింది. కృష్ణాజిల్లాలోని 37 సొసైటీల్లో ప్రతి ఏటా సగటున రూ.11.99 కోట్ల విలువైన 7,02,633 మీటర్ల చేనేత వస్త్రాల ఉత్పత్తి జరుగుతోంది. వినాయక చవితి, దసరా, దీపావళి, సంక్రాంతి పండుగలకు గతంలో 30 శాతం రిబేటు ప్రకటించారు. ఆయా సందర్భాల్లో సొసైటీల్లో 35 శాతం వరకు చేనేత వస్త్ర విక్రయాలు పెరిగాయి. తాజాగా రిబేటుపై ప్రకటన చేయకపోవడంతో దసరా పండుగకు సాదాసీదాగానే వస్త్ర వ్యాపారం సాగింది. 2016-17 నుంచి 2018-19 వరకు మూడేళ్లలో పండుగలకు ప్రకటించిన 30 శాతం రిబేటు రూ. 6.11 కోట్లు, యార్న్ సబ్సిడీ మరో రూ. 6.96 కోట్లు మేర సొసైటీలకు చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేయలేదు.

## సుప్రీం తదుపరి చీఫ్ జస్టిస్‌గా సంజీవ్ ఖన్నా

2025 మే 13 వరకు జస్టిస్ సంజీవ్ ఖన్నా పదవిలో ఉంటారు. 2019లో ఢిల్లీ హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఖన్నా పదోన్నతి పొందారు. నిబంధనల ప్రకారం జస్టిస్ డీవై చంద్రచూడ్ ప్రతిపాదనను కేంద్ర న్యాయశాఖ పరిశీలించి ప్రధానమంత్రికి పంపిస్తుంది. ప్రధాని మోదీ ఆమోదం తరువాత రాష్ట్రపతి వద్దకు వెళుతుంది. రాష్ట్రపతి ఆమోదముద్రతో తదుపరి ప్రధాన న్యాయమూర్తి ఎంపిక ఖరారవుతుంది. 2022 నవంబర్ 9వ తేదీన ఛీఫ్ జస్టిస్‌గా ప్రమాణ స్వీకారం చేసిన జస్టిస్ డీవై చంద్రచూడ్ ఎక్కువకాలం ఈ పదవిలో ఉన్నారు. సంప్రదాయం ప్రకారం సీజేఐ తన తర్వాత ఆ పదవిని చేపట్టేందుకు అత్యంత సీనియర్ న్యాయమూర్తి పేరును సిఫార్సు చేస్తారు. ఆ లెక్కన జస్టిస్ డివై చంద్రచూడ్ తర్వాత జస్టిస్ ఖన్నా అత్యంత సీనియర్‌గా ఉన్నారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా బార్ కౌన్సిల్ ఆఫ్ ఢిల్లీలో న్యాయవాదిగా 1983లో పేరు నమోదు చేసుకున్నారు. తీస్ హజారీ కోర్టులో ప్రాక్టీసు ప్రారంభించారు. ఆ తరువాత ఢిల్లీ హైకోర్టులో న్యాయవాదిగా కొనసాగారు. 2004లో ఇన్‌కంటాక్స్ శాఖకు సీనియర్ స్టాండింగ్ కౌన్సిల్‌గా సేవలందించారు. ఢిల్లీ హైకోర్టులో ఎమికస్ క్యూరీగా, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సేవలు అందించారు. ఆ తరువాత 2005లో ఢిల్లీ హైకోర్టు అడిషనల్ జడ్జిగా, 2006లో శాశ్వత న్యాయమూర్తిగా నియామితులయ్యారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా ఢిల్లీ జ్యుడీషియల్ అకాడమీ ఛైర్మన్‌గా, ఢిల్లీ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ సెంటర్ ఇన్‌ఛార్జిగా కొనసాగారు. 2019 జనవరి 18న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. ఏ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సేవలు అందించకుండానే సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయ్యారు. ఎలక్టోరల్ బాండ్స్, ఆర్టికల్ 370 తొలగింపు, సెంట్రల్ విస్టా ప్రాజెక్ట్ సంబంధిత కేసుల్లో జస్టిస్ సంజీవ్ ఖన్నా పాత్ర కీలకమైంది. కాగా నవంబరు 11న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పదవీ విరమణ చేయనున్నారు. ఆ మరుసటిరోజు అంటే నవంబరు 12న జస్టిస్ ఖన్నా సీజేఐగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. ఆరు నెలల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు.

## పొన్నవోలుకు ఏబీఎన్ ప్రతినిధి షాక్

నోటీసులు ఇవ్వడంతో వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి మంగళగిరి పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. సజ్జలతో పాటు పొన్నవోలు సుధాకర్ రెడ్డి, లేళ్ల అప్పిరెడ్డి, మాజీ మంత్రి మేరుగ నాగార్జున వచ్చారు. సజ్జలతో పాటు వైసీపీ నాయకులు స్టేషన్ లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించగా.. పోలీసులు అనుమతి లేదని తెలిపారు. దీంతో పొన్నవోలు సుధాకర్ రెడ్డి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఒకానొక దశలో పోలీసులపై వేలు చూపిస్తూ పొన్నవోలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సజ్జలతో పాటు తన ను లోపలికి అనుమతించలేదని పొన్నవోలు తెలిపారు. సజ్జల రామకృష్ణారెడ్డిపై 24వ తేదీ వరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని కోర్టు ఉత్తర్వులు జారీచేస్తే 10వ తేదీన లుక్‌అవుట్ నోటీసులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. టీడీపీ కార్యాలయంపై దాడి జరిగిన రోజు సజ్జల రామకృష్ణారెడ్డి 500 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు కోర్టుకు ఆధారాలు ఇచ్చామన్నారు. పోలీసులకు విచారించే అధికారం ఉన్నట్లే నిందితులకు హక్కులు ఉంటాయన్నారు. టీడీపీ కార్యాలయం దాడి కేసును రకరకాలుగా తిప్పుతున్నారన్నారు. మూడేళ్ల క్రితం ముగిసిన కేసుతో కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని పొన్నవోలు ఆరోపించారు. దీనిపై న్యాయ పోరాటం చేస్తామన్నారు. ఆధారాలు లేకుండా వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డిపై కేసు నమోదు చేశారన్న పొన్నవోలు సుధాకర్ రెడ్డికి ఏబీఎన్ ప్రతినిధి షాక్ ఇచ్చారు. ఏ ఆధారాలతో పొన్నవోలుపై కేసు నమోదు చేశారనగానే.. చంద్రబాబుపై ఏ ఆధారాలతో కేసు నమోదు చేశారని ఏబీఎన్ ప్రతినిధి ప్రశ్నించారు. సమాధానం చెప్పలేక పొన్నవోలు సుధాకర్ రెడ్డి ఆవేశంగా ఊగిపోయారు. ఆ కేసు గురించి నీకేం తెలుసంటూ పొన్నవోలు ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు కేసు గురించి మాట్లాడటం అప్రస్తుతమంటూ పొన్నవోలు ఊగిపోయారు. సరైన సమాధానం చెప్పలేక ఎదురుదాడికి దిగారు.

## చెన్నైకి భారీ వర్ష సూచన

డిసెంబరులో ఒక్కసారిగా భారీ వర్షాలు కురవడంతో ఇళ్లలోకి వరద నీరు చేరి, కార్లు కొట్టుకుపోయిన నేపథ్యంలో ఈసారి అలాంటి పరిస్థితులు తలెత్తకుండా వారు హోటళ్లలో దిగుతున్నారు. కార్ల పార్కింగ్‌కు ప్రత్యేక వసతి, తాగునీరు, విద్యుత్ సరఫరాతోపాటు వైఫై ఉండేలా చూడాలన్న షరతులతో గదుల్లో దిగినట్లు సమాచారం. గురువారం భారీ నుంచి అతిభారీ వర్షసూచన చేశారు. బుధవారం రెడ్ ఎలర్ట్ ఇచ్చినా, సాయంత్రం వరకు తేలికపాటి జల్లులే పడటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. భారీ వర్షాలకు బెంగళూరు నగరంలో జనజీవనం స్తంభించింది. చిక్కబళ్లాపుర, కోలారు, రామనగర, మైసూరు, చామరాజనగర, ఉడుపి, మంగళూరు, ఉత్తర కర్ణాటక, చిత్రదుర్గ తదితర జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఐటీ, బీటీ కేంద్రాలకు నిలయమైన బెంగళూరులోని మాన్యత టెక్‌పార్కు ఆవరణలో నూతన నిర్మాణాల కోసం తీసిన పునాదుల్లో మట్టి పెళ్లలు విరిగిపడ్డాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షం నీరు ప్రవేశించింది. బెంగళూరు ఇందిరానగర్ సమీప మెట్రో మార్గంపై ఓ చెట్టు కూలడంతో కాసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

## సీఎంను పొగుడుకుంటూనే షాకింగ్ కామెంట్స్ చేసిన షర్మిల..

'నిన్నటి క్యాబినెట్ మీటింగ్‌లో సూపర్ సిక్స్‌లో ఒక్క సిక్స్ గురించి అయినా చర్చిస్తారు. ఒక్కటైనా అమలు చేస్తారని అనుకున్నాం. మహిళలకు శుభవార్త చెప్తారని అనుకున్నాం. ఉచిత సిలిండర్లు, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ఈ రెండూలో బడ్జెట్ స్కీమ్‌లు. వీటిని అమలు చేస్తారని భావించాం. కానీ, ఎక్కడా వాటిని ప్రస్తావించలేదు. బాబు సూపర్ సిక్స్‌లు గాలికి కొట్టుకు పోయాయి. కొత్తగా సిక్స్ పాలసీలు వచ్చాయి. కొత్త పరిశ్రమలు వస్తే మంచిదే. పెట్టుబడులు రావాలి. ఉద్యోగాలు రావాలి. రూ. 30 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువస్తామన్నారు. 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. జాబ్ ఫస్ట్ అనేది తమ నినాదం అని సీఎం చంద్రబాబు చెప్పారు.' అని షర్మిల గుర్తు చేశారు.

'మాటలన్నీ బాగానే చెప్పారు. కానీ, ఇక్కడే బిలియన్ డాలర్ల ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఇవన్నీ అమలు చేసే చిత్తశుద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉందా? 2014లో పెద్ద పెద్ద పథకాలు అన్నారు. అమరావతిని సింగపూర్ అన్నారు. 3D గ్రాఫిక్స్ చూపించారు. అప్పుడు చెప్పిన వాటికి, ఇప్పుడు చెప్పిన వాటికి తేడా లేదు. పాత సినిమాకి కొత్త టైటిల్ పెట్టారు. చంద్రబాబు చెప్తుంటే ఈ కథ ఎక్కడో విన్నట్లుంది అనిపించింది. పాత గిఫ్ట్ కొత్త బాక్స్‌లో ఇస్తున్నారు. ఇవి అమలు అవుతాయా లేదా అనే అనుమానాలు ఉన్నాయి.' అని సందేహం వ్యక్తం చేశారామె.

## మూసీ సుందరీకరణ కాదు.. మూసీ నది పునరుజ్జీవం

పోలీసులతో కొట్టించి, గుర్రాలతో తొక్కించి మేం ఖాళీ చేయించటం లేదు. రంగనాయక్‌సాగర్, కొండపోచమ్మ.. ఇలా ఎక్కడికైనా నేను వస్తా. నేడు మూసీ నది కాలుష్యానికి ప్రతీకగా మారింది. 1600కు పైగా నివాసాలు పూర్తిగా మూసీ నది గర్భంలో ఉన్నాయి. మల్లన్నసాగర్‌లో మునిగిపోయిన 14 గ్రామాల్లో ఎలా వ్యవహరించారో తెలుసా? మేం ఉన్నపళంగా, నిర్దయగా ఎవరినీ ఖాళీ చేయించలేదు. నిర్వాసితులకు రెండుపడక గదుల ఇళ్లు కేటాయించి, రూ.25వేలు ఇచ్చాం. చెరువుల్లో అక్రమంగా నిర్మించుకున్న భవనాలనే హైడ్రా కూల్చింది. మూసీ పరివాహకంలో ఎవరి ఇళ్లను హైడ్రా కూల్చలేదు. చినుకు పడితే చాలు హైదరాబాద్‌లో గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్ అవుతోంది. రోడ్లపై పడిన వర్షపు నీరు చెరువుల్లోకి, నదుల్లోకి చేరాలా.. అలాగే రోడ్లపై ఉండాలా?' అని సీఎం ప్రశ్నించారు. అసలు ప్రాజెక్టుకు ఎందుకు చేపట్టారో వివరించారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ నేతలపై తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. మూసీ సుందరీకరణ అంశంపై వివాదం మరింత చెలరేగుతుండటంతో సీఎం రేవంత్ రెడ్డి గురువారం మీడియా ముందుకు వచ్చారు. మూసీ వివాదంపై స్పష్టత ఇచ్చారు. తెలంగాణ భవిష్యత్‌ను నిర్దేశిరచే ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టిందన్నారు. 33 బృందాలు మూసీ పరివాహకంపై అధ్యయనం చేశాయని సీఎం తెలిపారు. మూసీ పరివాహకంలో నివసిస్తున్న వారు దుర్భర పరిస్థితుల్లో ఉన్నారని.. అలాంటి వారికి మెరుగైన జీవితం అందించాలని భావిస్తున్నామన్నారు. విద్యావంతుల నుంచి నిరక్ష్యరాస్యుల వరకు అందరికీ హైదరాబాద్ ఉపాధి కల్పించాలన్నారు. గత ప్రధానులు పంచవర్ష ప్రణాళికలతో దేశాన్ని అభివృద్ధి చేశారని.. గత ప్రధానులు సంస్కరణలు తెచ్చిన ప్రతిసారీ కొన్ని వర్గాల నుంచి వ్యతిరేకత వచ్చిందని సీఎం గుర్తు చేశారు. 10 నెలలుగా అధికారులు నిద్రాహారాలు మాని మూసీపై పనిచేస్తున్నారని సీఎం తెలిపారు. మూసీ నదిలో పేదలు ఎదుర్కొంటున్న కష్టాలను అధికారులు గుర్తించారన్నారు. విప్లవాత్మక నిర్ణయాలను వ్యతిరేకించే వాళ్లు ఎప్పుడూ ఉంటారని అన్నారు. విషవలయంలో పేదలు ఉండాలనేది కొందరి ఆలోచన అంటూ విపక్షాలపై పరోక్షంగా సీఎం రేవంత్ విమర్శలు గుప్పించారు. భూగరిష్ట పరిమితి చట్టాన్ని వ్యతిరేకించిన వర్గం కూడా దేశంలో ఉండేదన్నారు. పేదలు ఎప్పుడూ పేదలుగానే ఉండాలని దొరలు, భూస్వాములు భావిస్తారన్నారు. కొందరు ప్రజా ప్రతినిధులు, అధికారులు రాష్టాన్ని దోచుకున్నారని సీఎం ఆరోపించారు. తాము చేపడుతున్నది మూసీ సుందరీకరణ కాదని.. మూసీ నది పునరుజ్జీవన కార్యక్రమం అని చెప్పారు. కొందరి మెదడులో మూసీలో ఉన్న మురికి కంటే.. ఎక్కువ విషం నింపుకున్నారంటూ విపక్ష నేతలపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. విషపూరిత ఆలోచనలతోనే మూసీ ప్రాజెక్ట్‌పై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. మూసీ పరివాహక ప్రజలకు మంచి జీవితం ఇవ్వాలనేది ప్రభుత్వ ఆలోచనగా సీఎం పేర్కొన్నారు. 'మూసీ సుందరీకరణ కోసం ప్రణాళికలు రూపొందించామని కేటీఆర్ అనలేదా? అడ్డుకుంటున్న నేతలు 3 నెలలు మూసీ ఒడ్డున జీవించాలి. కేటీఆర్, హరీశ్‌రావు, ఈటల 3 నెలలు మూసీ ఒడ్డున ఉండాలి. వాళ్లు 3 నెలలు అక్కడ ఉంటామంటే కావాల్సిన వసతులు కూడా కల్పిస్తాం. ఆ ముగ్గురూ మూడు నెలలు అక్కడ ఉంటే.. ఈ ప్రాజెక్టును ఆ పేస్తాం. మూసీ పరివాహకంలోనే ఉండి ప్రజల కోసం పోరాడాలి.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు తెలుగు దిన పత్రిక TELTEL12273


# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసిన దయాకర్ రెడ్డి



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:** బోనకల్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన సీఎం రిలీఫ్ ఫండ్ లబ్దిదారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి చెక్కులను అందించారు. తూటికుంట్ల గ్రామానికి చెందిన ఎం. చిట్టిబాబుకు, ముష్టికుంట్ల గ్రామానికి చెందిన మల్లయ్యకు, రామాపురం గ్రామానికి చెందిన జి. లక్ష్మికి, చిన్నబీరవల్లి గ్రామానికి చెందిన విమలమ్మకు ఈ చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మినేని కృష్ణ, భాగం నాగేశ్వరరావు, సురేష్, రాంబాబు, మురళీ, కృష్ణ, వెంకట్రావు, వెంకటేశ్వర్లు, యోహాను, సతీష్ తదితరులు ఉన్నారు.

# దేవాలయానికి బీరువ దానం చేసిన గౌని యశోదమ్మ, విజయవర్ధన్ రెడ్డి దంపతులు





**వనపర్తి జిల్లా ప్రతినిధి తెలంగాణ ముచ్చట్లు:** సంపాదనలో ఎంతో కొంత సమాజానికి తిరిగి ఇవ్వాలన్న ఆలోచన ఎంతో గొప్పది. అలాంటి ఆలోచనలు చేతుల్లో చూపిన వ్యక్తులు అందరికీ ఆదర్శవంతులు అవుతారు. సొంత ఊరు దేవాలయానికి తమ వంతుగా యశోదమ్మ విష్ణువర్ధన్ రెడ్డి దంపతులు సహాయం చేయడం జరిగింది. వివరాల్లోకి వెళితే....మహబూబ్ నగర్ జిల్లా అడ్డకల్ మండలంలోని బలీదుపల్లి గ్రామానికి చెందిన బిపిఎల్ ఫౌండేషన్ సభ్యులు గౌని రాఘవేందర్ రెడ్డి గారు వారి తల్లిదండ్రులు గౌని యశోదమ్మ విజయవర్ధన్ రెడ్డి పేరు మీద గ్రామ శ్రీ శ్రీ శివ రామాంజనేయ స్వామి దేవాలయానికి టుడోర్స్, పెద్ద బీరువాను ఇప్పించడం జరిగింది, వారికి దేవాలయ కమిటీ తరఫున గ్రామ ప్రజలందరి తరపున కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది.

# పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

## - గాలి కుంటు వ్యాధి నుంచి పశువులను కాపాడుకోవాలి

## - జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. వై రాధాకిషన్



**తెలంగాణ ముచ్చట్లు, జఫర్గడ్:** మండల కేంద్రంలో మండల పశు వైద్యాధికారి డా.సిహెచ్ రజిత ఆద్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరాన్ని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. వై రాధాకిషన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.అనంతరం సిబ్బందికి, రైతులకు పలు సూచనలు చేశారు.వారు మాట్లాడుతూ... కాలానుగుణంగా పశువులకు వచ్చే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అలాగే గాలి కుంటు వ్యాధి కారణంగా పాడి పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గుతుందన్నారు. అదే విధంగా కాడేద్దులు తీవ్ర అస్వస్థతకు గురి అవుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు డా. డి సారంగపాణి, వెటర్నరీ అసిస్టెంట్ మంజుల, గోపాల మిత్రలు చిలువేరు నగేష్, రాజు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక ట్రాక్టర్లు పట్టివేత




**తరిగొప్పుల, తెలంగాణ ముచ్చట్లు:** ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తరిగొప్పుల ఎస్సై శ్వేత తెలిపారు. మండలంలోని అబ్దుల్ నాగారం గ్రామంలో పోలీస్ సిబ్బంది గాలిబ్ , శ్రీనివాస్ , బాలాజీ మరియు ప్రదీప్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను ఆపి పత్రాలు చూపించమని అడగగా ఏ లాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండడంతో అట్టి ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించి సీజ్ చేశారు లింగంపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమానులైన మాటే శ్రీనివాస్, మేకల రాజు అదే గ్రామానికి చెందిన , ట్రాక్టర్ డ్రైవర్లు విష్ణువర్ధన్ , మాలోత్ సందీప్ ల పై కేసు నమోదు చేశామని తెలిపారు.

# ఘనంగా శ్రీ శ్రీ వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు




**వనపర్తి జిల్లా ప్రతినిధి తెలంగాణ ముచ్చట్లు:** పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామంలో వాల్మికుల ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. గ్రామంలో ఉన్న వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి, పాలాభిషేకంతో జయంతి వేడుకలను వాల్మీకి సోదరులు నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి సోదరుడు బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు మలక్ సురేష్ మాట్లాడుతూ.. ఒక సామాన్య వ్యక్తిగా పుట్టి వేటగాని వృత్తితో జీవితం గడిపి సప్త ఋషుల బోధన ద్వారా మహర్షి వాల్మీకి గా మారి అద్భుతమైన రామాయణం గ్రంధాన్ని మనకు అందించిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ శాఖ వెంకటయ్య, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు మల్లక్ సురేష్, పెద్ద భీమన్న, రాములు, కావలి నాగన్న, మల్లక్ కృష్ణయ్య, ఆంజనేయులు, జింకల బాలరాజ్, జింకల చిన్న కుమార్, శ్రీను, శాఖ వెంకయ్య, శాఖ మన్నెం, ముమ్మాళ్ళ వెంకటేష్, జల్లి కురుమూర్తి, చిన్న కాశన్న, గుర్రాల ఎల్లప్ప, బసరత్, మన్నెంకొండ, పెద్ద కాశన్న, బోయ దానప్ప, శాఖ పెద్ద కొండయ్య, బోయ శేఖర్, కావలి ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరాముని దివ్య చరితను మానవాళికి అందించిన వాల్మీకి మహర్షి

## - ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వెల్లడి

**ఢిల్లీ / ఏలూరు, తెలంగాణ ముచ్చట్లు :** పురుషోత్తముడు శ్రీరాముని దివ్య చరితను పరమ పవిత్రమైన రామాయణం రూపంలో వాల్మీకి మహర్షి ప్రపంచానికి అందించారని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో కొనియాడారు.. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఏలూరు శాంతినగర్ లోని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కార్యాలయంలో గురువారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా కూటమి నాయకులు, కార్యాలయం సిబ్బంది వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.. బోయవానిగా జన్మించిన రత్నాకరుడు మహర్షిగా పరివర్తన చెందిన తీరు మానవ జీవితంలో మార్పును సూచిస్తుందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్పష్టం చేశారు.. ఒక పక్షి మరణం బోయవాడిని మహర్షిని చేసిందని ఎంపీ పుట్ట మహేష్ కుమార్ తెలిపారు.. తెదేపా యువ నాయకుడు, మంత్రి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర సందర్భంగా బోయ, వాల్మీకి సోదరులు రాష్ట్ర పండుగగా వాల్మీకి జయంతిని నిర్వహించాలని కోరిన విషయాన్ని కూటమి ప్రభుత్వం అధికారం రాగానే ఆదేశాలు జారీ చేయడాన్ని స్వాగతిస్తున్నట్లు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్పష్టం చేశారు.. వాల్మీకి మహర్షి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం బీసీలకు తమ ప్రభుత్వం ఇస్తున్న సముచిత స్థానానికి నిదర్శనమని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వెల్లడించారు.. తెలుగుదేశం పార్టీ బీసీలకు పుట్టినిల్లు అని, వారి ఆత్మ గౌరవాన్ని పెంపొందించే దిశగా తమ ప్రభుత్వం అడుగులు వేస్తుందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు.. ఎంపీ కార్యాలయంలో జరిగిన వాల్మీకి మహర్షి జయంతి వేడుకల్లో కూటమి నాయకులు నందిగం సీతారామ తిలక్( బాబి) , మాగంటి హేమ సుందర్, వీర్ల ప్రతాప్, నందిగం రవిచంద్ర (రవి), చల్లగొళ్ళ సుమన్, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ వాల్మీకి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

## -మద్దిగట్ల మాజీ ఎంపీటీసీ రామచంద్ర గౌడ్




**వనపర్తి జిల్లా ప్రతినిధి తెలంగాణ ముచ్చట్లు:** పెద్దమందడి మండలం మద్దిగట్ల గ్రామంలో మాజీ ఎంపీటీసీ రామచంద్ర గౌడ్ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలవేసి జయంతి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ రామచంద్ర గౌడ్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ వాల్మీకి మహర్షి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు మహా పురుషులవుతారు అనేదానికి వాల్మీకి మహర్షి జీవిత చరిత్ర నిలువెత్తు నిదర్శనమని, ఏ వయస్సులో అయిన పట్టుదలతో పని చేస్తే విజయం సాధించవచ్చు అని వాల్మీకి మహర్షి నిరూపించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రామచంద్ర గౌడ్, మాజీ సర్పంచ్ చెన్నకేశవులు, భీమని పెంటయ్య, రాములు గౌడ్, శివారెడ్డి, మీసాల చంద్రయ్య, కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మహర్షి వాల్మీకి జీవితం గొప్ప స్ఫూర్తి పథం

## - జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ డా. నిధి మీనా



**ఎన్‌టీఆర్ జిల్లా, తెలంగాణ ముచ్చట్లు :** మహర్షి వాల్మీకి జీవితం.. ఆయన సమాజానికి అందించిన రామాయణ మహా కావ్యం గొప్ప స్ఫూర్తి పథమని జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ డా. నిధి మీనా పేర్కొన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతి మహోత్సవం గురువారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ డా. నిధి మీనా అధికారులతో కలిసి మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిధి మీనా మాట్లాడుతూ వాల్మీకి.. మహామునిగా, కవిగా, మహర్షిగా తన జీవితాన్ని మలుచుకోవడమే కాకుండా ఆత్మీయమైన, అద్భుతమైన రామాయణ మహా కావ్యాన్ని ఈ సమాజానికి అందించడం ద్వారా గొప్ప సందేశాన్ని అందించారన్నారు. మనిషి సంకల్పిస్తే ఏదైనా సాధించగలమని వాల్మీకి జీవితం ద్వారా తెలుసుకోవచ్చన్నారు. మహర్షి వాల్మీకి జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో పయనించాల్సిన అవశ్యకత ప్రస్తుత సమాజానికి ఎంతైనా ఉన్నదని పేర్కొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
అనునిత్యం ప్రజల పక్షం
TELTEL12273
తెలుగు దిన పత్రిక


# రైతు సంక్షేమాన్ని విస్మరిస్తున్న కాంగ్రెస్ పార్టీ

**-ప్రజలను తప్పుదోవ పట్టిస్తే సహించేది లేదు**
**-కాంగ్రెస్ నాయకులకు బీఅర్ఎస్ ప్రజాప్రతినిధుల హెచ్చరిక**
**- అధికారంలోకి వచ్చిన ప్రజల్లో కాంగ్రెస్ కు ఆదరణ కరువు**
**-రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నాం**
**-పిఏసిఎస్ చైర్మన్ షేర్ల కైలాసం**



దుబ్బాక, తెలంగాణ ముచ్చట్లు : పదేళ్ల టిఆర్ఎస్ పాలనలో రైతుల ముఖాల్లో చిరునవ్వులు కనిపించాయని రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని పిఏసిఎస్ చైర్మన్ షేర్ల కైలాసం అన్నారు. దుబ్బాక లో గురువారం పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ వనిత భూమి రెడ్డి బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి గా కెసిఆర్ పదేళ్ల పాలనలో సాగునీరు . రైతులకు 24 గంటలు ఉచిత కరెంటు. రైతుబంధు . రైతు బరోసా లాంటి బృహత్తర పథకాలను ప్రవేశపెట్టి అమలు చేయడంతో బీడు బడిన భూముల్లో బంగారు పంటలు పండాయని గుర్తు చేశారు. దుబ్బాక లో పదేళ్లు టిఆర్ఎస్ పార్టీలో పనిచేసిన కొంతమంది నాయకులు అధికారం దూరం కాగానే కాంగ్రెస్ పార్టీలో చేరి బీఆర్ఎస్ పార్టీని విమర్శించడం ఆస్యాస్పదంగా ఉందన్నారు . గతంలో ఇదే నాయకులు ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి తొనే దుబ్బాక అభివృద్ధి సాధ్యమవుతుందని మాట్లాడిన మాటలు గుర్తుకు తెచ్చుకోవాలని హితులు పలికారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఇంకా ప్రజలు ఆదరించడం లేదని బీఆర్ఎస్ పార్టీపై . ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పై తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని ఇకముందు ఇలాగే పునరావృత్తమైతే సహించబోమని కాంగ్రెస్ నాయకులను హెచ్చరించారు పార్టీలు వేరైనా ప్రాంత అభివృద్ధి కొరకు కలిసి రావాలని హితవు పలికారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు . కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కడతాల రవీందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు రొట్టె రాజమౌళి, కౌన్సిలర్ లు ఇల్లందుల శ్రీనివాస్. ఆస యాదగిరి. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండెల్లి ఎల్లారెడ్డి, నాయకులు కొత్త కిషన్ రెడ్డి, బండి రాజు , పడల నరేష్, దేవరాజు తదితరులున్నారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

**-విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి**
**-పాఠశాలల్లో సౌకర్యాలు లోపిస్తే చర్యలు తప్పవు**
**- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి**







తొగుట, తెలంగాణ ముచ్చట్లు : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని కాన్గల్ లో ప్రాథమికొన్నత పాఠశాలలో మాజీ వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి సహకారం తో విద్యార్థులకు క్రీడా దుస్తులు, మండల పరిషత్ నిధులతో ఏర్పాటు చేసిన వైకుంఠ రథం, ఫ్రీజర్ ను, .పెద్ద మాసాన్ పల్లి లో పాఠశాలలో బి ఆర్ ఎస్ నాయకుడు పన్యాల ప్రవీణ్ రెడ్డి సహకారంతో విద్యార్థుల కు క్రీడా దుస్తులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధి కోసం మన ఊరు మన బడి కార్యక్రమం ద్వారా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ప్రైవేటు మోజు తో ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుందని విచారం వ్యక్తం చేశారు. కాన్గల్ పాఠశాలల్లో పారిశుధ్యం లోపించడం పట్ల ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు ఇలాంటి సమస్యలు పునరావృతం అయితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని, తనవంతుగా సహకారం అందిస్తామన్నారు. పాఠశాల ఉపాధ్యాయులను ఆయన సన్మానించారు ఈ సందర్భంగా పలువురికి సీఎం సహాయక నిధి ద్వారా చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు కార్యక్రమాల్లో మండల పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి, సొసైటీ చైర్మన్ కే హరికృష్ణా రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమల కొమురయ్య, నాయకులు వేల్పుల స్వామి,కంది రాంరెడ్డి, సుతారి రమేష్, కొమ్ము శరత్, చంద్రా రెడ్డి,పబ్బతి శ్రీనివాస్ రెడ్డి,మంగ నర్సింలు, యాదగిరి, అల్వాల రాజి రెడ్డి,మధుసూదన్ రెడ్డి, బోయిని శ్రీనివాస్, మాదాసు అరుణ్ కుమార్, లక్ష్మారెడ్డి, తగరం అశోక్, పులి రాజు, గంగనిగల్ల బాలరాజు, రమేష్, అనిల్, శ్రీధర్, గురువారెడ్డి, భైరాగౌడ్, రాములు, పిట్ల వెంకటయ్య, రాంబాబు, కుమార్, కర్ణాకర్, నర్సింలు, నరేందర్ గౌడ్, సుభాష్ గౌడ్ తదితరులున్నారు

**-విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం పై ఆగ్రహం**

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం పై ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడికందులలో విద్యుత్ ప్రమాదంలో మరణించిన యువ రైతు గోరేటి గురువారెడ్డి కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. విద్యుత్ లూస్ వైర్లు ఉండటంతోనే స్పింకర్ల పైపు కు విద్యుత్ వైర్లు తాకడం తో మరణించాడన్నారు గురువా రెడ్డి మరణించిన తర్వాత స్తంబాలు వేశారని, ముందు జాగ్రత్త పడితే ప్రాణాలు దక్కేవన్నారు.

# బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు



దుబ్బాక, తెలంగాణ ముచ్చట్లు : పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని కాంగ్రెస్ పార్టీ నేషనల్ వారియర్ జిల్లా అధ్యక్షుడు గజభీంకర్ అశోక్ అన్నారు. జిల్లా అధ్యక్షునిగా నియామకమైన సందర్భంగా గురువారం ఆ పార్టీ కిసాన్ సేల్ నాయకులు అందే రాజిరెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి కమలాకర్ లు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీ నమ్ముకున్న ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం దక్కుతుందన్నారు. తనపై నమ్మకంతో పదవిని ఇచ్చినందుకు వమ్ము చేయకుండా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దేవర మహిపాల్ యాదవ్, కిశోర్, కర్రోల్ల చిన్న కాళిదాసు తదితరులున్నారు

# అక్షర యోధుడు షోయబుల్లాఖాన్

**-రాయపోల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పుట్ట రాజు**



రాయపోల్, తెలంగాణ ముచ్చట్లు : నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తన కలంతో ప్రశ్నించిన నికార్సైన కలంవీరుడు షోయబుల్లాఖాన్. నేటి జర్నలిస్టులకు షోయబుల్లాఖాన్ ఎంతో స్ఫూర్తిదాయకమని రాయపోల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పుట్ట రాజు అన్నారు. గురువారం రాయపోల్ మండల కేంద్రం ప్రెస్ క్లబ్ లో షోయబుల్లాఖాన్ 104 వ జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూసమసమాజం కోసం, అణగారిన అమాయక ప్రజల కోసం ఏదో చేయాలన్న తపనతో షోయబ్ జాతీయోద్యమ స్ఫూర్తితో జర్నలిజాన్ని వృత్తిగా ఎంచుకొని మొదట షోయబ్ 'తేజ్ 'అనే ఉర్దూ పత్రికలో ఉప సంపాదకుడిగా చేరాడు. నిరంకుశ నిజాం ప్రభుత్వం, అతని తాబేదార్లయిన రజాకార్ల దౌర్జన్యాలు, అరాచకాలను తీవ్ర స్థాయిలో విమర్శిస్తూ వార్తలనే అస్త్రాలను సంధించాడు. ప్రజా సమస్యలపై పాలకులను నిలదీస్తూ ప్రజల్లో చైతన్యం తెచ్చే ప్రయత్నం చేశాడు. చివరకు 'తేజ్' పత్రికను నిషేధించారు.తేజ్ పత్రిక తర్వాత మందుముల నర్సింగరావు ఆధ్వర్యంలో వెలువడుతున్న 'రయ్యత్' అనే ఉర్దూ దినపత్రికలో చేరాడు. పాలకవర్గాల దౌర్జన్యాలను, దోపిడీని చీల్చి చెండాడాడు. కొంత కాలానికి నిజాం ప్రభుత్వం 'రయ్యత్' పత్రికను కూడా మూసివేయించింది. తన భార్య, తల్లి ఆభరణాలు అమ్మి 'ఇమ్రోజ్' అనే ఉర్దూ పత్రికను ప్రారంభించాడు. 'ఇమ్రోజ్' అంటే 'నేడు' అని అర్థం. 'ఇమ్రోజ్' దినపత్రిక తొలి సంచిక 1947 నవంబరు 1 వ తేదీన వెలువడిందన్నారు. నిజాం సంస్థానాన్ని ఇండియన్ యూనియన్ లో విలీనం చేయాల్సిందేనని ఖరాఖండిగా చెబుతూ సంపాదకీయాలు రాసిన అక్షర వీరుడన్నారు. విశాల దేశ ప్రయోజనాల దృష్ట్యా విలీనం తప్పనిసరని పేర్కొన్నాడు. 'పగటి ప్రభుత్వం - రాత్రి ప్రభుత్వం' పేరుతో 1948 జనవరి 29 న ఒక వ్యాసంలో ఇత్తెహాదుల్ ముసల్మీన్ సంస్థపై ఎందుకు నిషేధం విధించదు ? అంటూ తీవ్ర విమర్శనాస్త్రాలు సంధించిన ధైర్యశీలి షోయబుల్లాఖాన్. అలాంటి కలం వీరుడినీ నేటి జర్నలిస్టులు స్ఫూర్తిదాయంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయపోల్ ప్రెస్ క్లబ్ కోశాధికారి నర్సింలు, జర్నలిస్టు సభ్యులు మన్నె గణేష్, కనుక స్వామి, ప్రజా సంఘాల నాయకులు లింగం శ్రీకాంత్ నవీన్ భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

# తాడిగడప మున్సిపాలిటీ అభివృద్ధికి అధికారులు కృషి చేయాలి : జిల్లా కలెక్టర్

తాడిగడప (పెనమలూరు), తెలంగాణ ముచ్చట్లు : అధికారులందరూ సమిష్టిగా పనిచేస్తూ తాడిగడప మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. గురువారం ఉదయం పెనమలూరు మండలం, తాడిగడపలోని బందరు రోడ్డు ప్రధాన రహదారి పక్కన ఉన్న ద్వారక హొటల్ ఫంక్షన్ హాల్లో జిల్లా కలెక్టర్ పెనమలూరు నియోజకవర్గ శాసన సభ్యులు బోడే ప్రసాద్ తో కలసి తాడిగడప మున్సిపాలిటీ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా స్థానిక శాసన సభ్యులు తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన సమస్యలను కలెక్టర్ కు వివరించారు. మున్సిపాలిటీలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని, దీనికి తోడు పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైందని తెలిపారు. ప్రస్తుతం మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణకు 328 మంది సిబ్బంది మాత్రమే ఉన్నారని, పెరిగిన జనాభాకు అనుగుణంగా పనులు సజావుగా సాగేందుకు అదనంగా మరో 75 మంది సిబ్బందిని కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

దీనిపై స్పందించిన కలెక్టర్ అందుకు తగిన ఫైల్ సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించాలని మున్సిపల్ కమిషనర్ కు సూచించారు. అదేవిధంగా ప్రస్తుత కార్యాలయాలన్నీ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణానికి స్థలం కేటాయింపు చేయాలని, హౌస్ హోల్డ్ అసెస్మెంట్ రూపొందించడానికి కొన్ని రోజులపాటు సచివాలయ ఉద్యోగులను కేటాయించాలని శాసనసభ్యులు కోరారు. మున్సిపాలిటీకి ఎన్నికలు జరగకపోవడంతో 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు కాలేదని, మున్సిపాలిటీ అభివృద్ధికి సరైన ఆదాయ వనరులు లేవని, ఈ నేపథ్యంలో తక్షణమే ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ స్పందిస్తూ మున్సిపాలిటీ పరిధిలోని ఇంటి, నీటి, ఆస్తి పన్నులను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా కొత్త అంచనాలు తయారు చేసేందుకు సచివాలయ సిబ్బందిని కేటాయిస్తున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ఆదాయ వనరులను బలోపేతం చేసుకునేందుకు అధికారులు, సచివాలయ ఉద్యోగులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. పన్నుల విషయంలో డీఫాల్టర్లను గుర్తించి ప్రతి ఒక్కరి నుంచి అన్ని పన్నులు వసూలు చేయాలన్నారు. వారు చెల్లించే పన్నులను తిరిగి మున్సిపాలిటీ అభివృద్ధికే ఉపయోగిస్తున్నారన్న విషయాన్ని గుర్తుచేసి సకాలంలో పన్నులు చెల్లించే విధంగా వారిని ప్రోత్సహించాలన్నారు. బందరు రోడ్డు ప్రధాన రహదారి పక్కన డ్రైనేజీని సక్రమంగా నిర్మించాలని, అందుకు అవసరమైన అంచనాలను రూపొందించి సమర్పించాలని జాతీయ రహదారుల అధికారులకు ఫోన్ ద్వారా మాట్లాడి సూచించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU

# మహనీయుల జీవితాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని వారి ఆశయాల సాధన దిశగా కృషి చేయాలి





మెదక్,తెలంగాణ ముచ్చట్లు : మహనీయుల జీవితాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని వారి ఆశయాల సాధన దిశగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో వాల్మీకి జయంతి, కొమరం భీం వర్ధంతి సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తో కలిసి జ్యోతి ప్రజ్వలన గావించి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన కలెక్టర్ గురువారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొమరం భీం వర్ధంతి చిత్రపటాలకు పూలమాలలు వేసి కలెక్టర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాల్మీకి జయంతిని ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ మహాకవి వాల్మీకి హిందూ ధర్మానికి అతి ముఖ్యమైన గ్రంథం రామాయణాన్ని రచించారని.. దాని ద్వారా సమాజానికి అనేక విలువలను అందించారని. మానవీయ విలువలను ప్రతిపాదిస్తూ ఆ జ్ఞానాన్ని ప్రపంచానికి అందించిన జ్ఞాన ఘని.. మహర్షి వాల్మీకిలి కలెక్టర్? పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ అనుసరించవలసిన ఆదర్శ కావ్యం రామాయణమని..అలాంటి రామాయణాన్ని రచించిన వాల్మీకి జీవిత చరిత్రలను తెలుసుకోవడం ద్వారా స్ఫూర్తిని పొంది, వారి మార్గంలో పయనించడం ద్వారా అనుకున్న లక్ష్యాలను సునాయాసంగా సాధించగలుగుతామన్నారు. అనంతరం కొమరం భీమ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి వర్ధంతి వేడుకలలో నిర్వహించారు. ఆదివాసి ఆత్మగౌరవానికి ప్రతీక కొమరం భీమ్ అని జల్, జంగల్, జమీన్ కోసం సాయుధ పోరాటాలు చేశారు.తమ భూమిలో తమదే అధికారం అని (భూమి. అడవి.నీరు మాదే) అనే నినాదంతో ఉద్యమించి వీరమరణం పొందారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈఓ ఎల్లయ్య,వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి నాగరాజుగౌడ్, గిరిజన సంక్షేమ అధికారి, సంబంధిత నాయకులు ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి పట్టభద్రులు ఓటరుగా నమోదుచేసుకోవాలి

## - జిల్లాలో తాసిల్దార్ కార్యాలయాల్లో ఓటరు నమోదు కేంద్రాల ఏర్పాటు - డిగ్రీ-2021 నవంబర్ లోపు పూర్తి చేసిన వారు అర్హులు








మెదక్, తెలంగాణ ముచ్చట్లు : ఓటర్ నమోదు తేదీలు2024 సెప్టెంబర్ 30 నుండి ,నవంబర్ 06 తేదీ వరకు హవేలీ ఘన్పూర్ మండలం తాసిల్దార్ కార్యాలయంలో ఓటు హక్కు నమోదు చేసుకున్న జిల్లా కలెక్టర్ మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పట్టభద్రులు, శాసనమండలి ఎన్నికకు ఓటరు నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ తెలిపారు. గురువారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా హవేలీ ఘన్పూర్ మండలం తాసిల్దార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదు చేసుకున్నారు.

ఈ సందర్భంగా పట్టభద్రుల ఓటరు నమోదుపై ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం,ఉమ్మడి మెదక్- నిజామాబాద్- అదిలాబాద్- కరీంనగర్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం సంబంధించి అర్హత కలిగిన జిల్లాలోని తాసిల్దార్ కార్యాలయంలో ఓటరు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. 1.11.2021 కంటే ముందు డిగ్రీ, ఏదేని తత్సమాన అర్హతలు కలిగిన పట్ట భద్రులు, డిగ్రీ మెమో,ప్రొవిజనల్ సర్టిఫికెట్, ఆధార్ కార్డ్ ,ఓటర్ ఐడి ,పాస్పోర్ట్ సైజ్ ఫోటో ఈమెయిల్ ఐడి, ఫోన్ నెంబర్ అవసరం ఉంటాయన్నారు. అర్హులైన పట్ట భద్రులు ఫారం 18 తమ దరఖాస్తులను సంబంధిత సర్టిఫికెట్లను జత చేస్తూ తహసిల్దార్ కార్యాలయం, రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయం నందు మాన్యువల్ గా లేదా %ఎవశేవశ్రీఖఅస్త్రుఖఖు.అఅఎ.అఅ% అనే వెబ్ సైట్ లో ఆన్లైన్ ద్వారా నవంబర్ 6 లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు నవంబర్ 23 న డ్రాఫ్ట్ ఓటర్ జాబితా ప్రచురించాలని, డిసెంబర్ 9 లోపు డ్రాఫ్ట్ జాబితా పై అభ్యంతరాలను స్వీకరించి డిసెంబర్ 25 లోపు పరిష్కరించాలని, డిసెంబర్ 30న తుది ఓటర్ జాబితా ప్రచురించాల్సి ఉంటుందని అన్నారు. తాసిల్దార్ కార్యాలయాల్లో ఓటరు నమోదు ఫారాలు ఉచితంగా అందచేయనున్నట్లు తెలిపారు. పూరించిన దరఖాస్తులు తహసీల్దార్ కార్యాలయాల్లో అందచేయాలని సూచించారు. నవంబర్ 6వ తేది వరకు ఓటరు నమోదుకు అవకాశం ఉన్నదని, అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరు గా నమోదు కావాలని ఆయన పేర్కొన్నారు.

# యువతకు ఉపాధి కల్పన లక్ష్యం

గుడ్లవల్లేరు(కౌతవరం) : యువతకు ఉపాధి కల్పన లక్ష్యంతో ప్రభుత్వం రాష్ట్రంలో పెట్టుబడులు సాధించి, పరిశ్రమలు ఏర్పాటు చేసి వారి బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తున్నట్లు రాష్ట్ర రెవిన్యూ, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ అన్నారు. రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, గుడివాడ శాసనసభ్యులు వెనిగండ్ల రాము, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ లతో కలసి రెవెన్యూ మంత్రి గురువారం కౌతవరంలో 23 లక్షల అంచనా వ్యయంతో ఆధునీకరించిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనం ప్రారంభించారు. అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము,,జేసీలతో కలిసి కౌతవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన హెచ్ పి పెట్రోల్ బంక్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పెట్రోల్ బంకు వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో రెవెన్యూ మంత్రి మాట్లాడుతూ వంద ఏళ్లకు పైగా చరిత్ర గల సబ్ రిజిస్ట్రార్ భవనం ఆధునికరించి ఈరోజు ప్రారంభించుకున్నామని, అదేవిధంగా పిఎసిఎస్ ఆధ్వర్యంలో హెచ్పీసీఎల్ బంక్ ప్రారంభించుకున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో గుడివాడ అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఆర్థిక స్థిరత్వం లేని పరిపాలనతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి మొదటిగా 5 ఫైళ్లపై సంతకాలు చేశారన్నారు.

# పత్తి కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేయాలి

మెదక్,తెలంగాణ ముచ్చట్లు : పత్తి కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐ డి ఓ సి కార్యాలయపు కాన్ఫరెన్స్ హాల్లో పత్తి కొనుగోలు ప్రక్రియపై అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లతో కలిసి మార్కెటింగ్, సహకార, సిసిఐ, పోలీస్,అగ్నిమాపక, వ్యవసాయ కాటన్ మిల్లుల యజమానులతో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పత్తి కొనుగోలు ఏర్పాట్లకు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పత్తి కొనుగోలు సీజన్ ప్రారంభం అవుతున్నదని సిసిఐ ద్వారా కొనుగోలు చేయుటకు అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. నవంబర్ మొదటి వారం నుండి పత్తి కొనుగోలు కేంద్రాలకు వస్తుందని తెలిపారు. జిల్లాలో 36 వేల142 ఎకరాలలో పత్తి సాగు జరిగిందని రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పత్తి కొనుగోలు సజావుగా, సక్రమంగా సాగేందుకు ఏర్పాట్లు చేయాలని అన్నారు. జిల్లాలో ఈ నెల 25 వ తేదీ వరకు పత్తి కొనుగోళ్ళు ప్రారంభించాలని ప్రతి రోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు కొనుగోలు జరపాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. సీసీఐ ద్వారా మాయిచ్చర్ మిషన్, సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని పోలీస్ శాఖకు సూచించారు. పత్తి కొనుగోలు కేంద్రాల్లో స్థానిక పోలీస్ అధికారుల నెంబర్లు, అత్యవసర నంబర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. తూనికలు కొలతలు శాఖ ద్వారా ప్రతి కొనుగోలు కేంద్రాలలో కాంటాలకు స్టాంపింగ్ చేయాలని ఆదేశించారు. గోదాములు, మిల్లుల వద్ద అగ్నిపాక శాక ద్వారా అగ్నిప్రమాదాలు జరగకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని అన్నారు. యాప్ ను రైతులు డౌన్లోడ్ చేసుకోవాలని, రైతుల ఖాతాలలో డబ్బులు జమ ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. మద్దతు ధర 7521 రూపాయలుగా ప్రకటించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. యాప్ గురించి వ్యవసాయ శాఖ అధికారులు పంచాయతీ కార్యదర్శులు ద్వారా గ్రామస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ అధికారి యాదయ్య జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు అగ్నిమాపక అధికారి వేణు లీగల్ మెట్రాలజీ అధికారి సుధాకర్ జిల్లా రవాణా అధికారి జి శ్రీనివాసరావు మండలాల అగ్రికల్చర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు

# వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు





సిద్దిపేట, తెలంగాణ ముచ్చట్లు : గురువారం సమికృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ వాల్మీకి మహర్షి జయంతి వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ దినం జాతిని గుర్తుంచుకునే రోజు, ప్రపంచం ఉన్నంతవరకు రామాయణం, వాల్మీకి చరిత్ర ఉంటుంది. ఇతిహాసాల్లో మొదటిది రామాయణం, పెద్దది మహాభారతం. అలాంటి రామాయణాన్ని రచించింది ఒక బోయ కులానికి చెందిన చోరుడు అయిన వాల్మీకి. ఈయన ఇచ్చిన స్ఫూర్తితో అనేక మంది రచయితలుగా, కవులుగా మారారు ముఖ్యంగా పెద్దబాలశిక్ష అనే పుస్తకంలో అన్ని అంశాలతో కూడినవి నేర్చుకోవడం జరుగుతుంది. ఇతిహాసాలోని సారాంశాలను ఈ తరం పిల్లలకు అర్థమయ్యే విధంగా పాఠశాల కరికులంలో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని మనమందరం కోరుకుందాం. ఇలాంటి గొప్ప వారి చరిత్రల గురించి తెలుసుకోవడం నేటి తరానికి చాలా అవసరమని తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి షేక్ అహ్మద్, వాల్మీకీ బోయ రాష్ట్ర అధ్యక్షుడు బోయ రాములు, కలెక్టరేట్ ఎఓ అబ్దుల్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్య విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా మెడికల్ కళాశాలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

దుబ్బాక, తెలంగాణ ముచ్చట్లు : వైద్య విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా మెడికల్ కళాశాలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఎంఎల్ఏ గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి ఎంఎల్ఏ గండ్ర సత్యనారాయణ రావు జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాలప్రొఫెసర్లు, సింగరేణి జి.యం, వైద్య కళాశాల కాంట్రాక్టర్లు, ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ వైద్య కళాశాలను పూర్తి స్థాయిలో నిర్వహించేందుకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. వైద్య కళాశాలలో 120 మంది బాలికలు, 80 మంది బాలురు వైద్య విద్యను అభ్యసిస్తున్నారని సింగరేణి అధికారులతో చర్చించి అదనంగా రామప్ప కాలనిలో ఒక బ్లాక్, 14 క్వార్టర్లు కేటాయించాలని కోరినట్లు తెలిపారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి తో మాట్లాడి వైద్య కళాశాల భవన నిర్మాణానికి పెండింగ్ ఉన్న బకాయిలు మంజూరు చేస్తామని అన్నారు. అసంపూర్తిగా ఉన్న కళాశాల భవనాన్ని సంవత్సరం కాలంలో పూర్తి చేయిస్తామని అన్నారు. రెండవ సంవత్సరం విద్యార్థులకు తరగతులు నిర్వహణకు అవసరమయ్యే ప్రాక్టికల్ ల్యాబ్, లెక్చరర్ హాల్ ను 20 రోజులలో అందుబాటులోకి తేవాలని ఇంజనీరింగ్ అధికారులను అదేశించారు. విద్యార్థులు కళాశాల నుండి జిల్లా ఆసుపత్రికి వెళ్ళడానికి 2 బస్సులు ఏర్పాటు చేస్తామని 21వ తేదీ నుండి రెండవ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ప్రభుత్వం తరుపున అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులు అడ్మిషన్లు పూర్తి కాగానే క్లాసులు ప్రారంభించాలని తెలిపారు. వైద్య కళాశాల అధ్యాపకులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలని కోరారు.

# రైతులు ముందస్తు ప్రణాళికతో రైతు యాజమాన్య పద్ధతులు పాటించాలి

## - బాపట్ల ఏరువాక కేంద్రం లో ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి





బాపట్ల, తెలంగాణ ముచ్చట్లు : రైతులు ముందస్తు ప్రణాళికతో రైతు యాజమాన్య పద్దతులు పాటించాలి అని ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డా. జి శివన్నారాయణ అన్నారు. గురువారం నాడు ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం బాపట్ల ఏరువాక కేంద్రం కార్యాలయాన్ని సందర్శించిన శివన్నారాయణ వాల్మీకి మహర్షి చిత్ర పటానికి పూల మాలలతో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భముగా ఆయన ఈ సంవత్సరం కార్యాలయ కార్యాచరణ గురించి తగు సూచనలు చేశారు. అనంతరం ఆయన జమ్ముల పాలెం లో వరిపొలాలని సందర్భించి రైతులకు తగు సలహాలు సూచనలు చేశారు. ఈ సందర్భముగా మాట్లాడుతూ రైతులు ముందస్తు ప్రణాళికతో రైతు యాజమాన్య పద్ధతులు పాటించటం ద్వారా దిగుబడులు పెంచవచ్చని అన్నారు. కార్యక్రమములో ఏరువాక కేంద్ర కోఆర్డినేటర్ డా. బాల మురళీధర్ నాయక్, ఏరువాక కేంద్ర విస్తరణ విభాగ సైంటిస్ట్ డా ఎం ఉష పాల్గొన్నారు.

# కేడీసీసీ బ్యాంకుకు ఎంతో ఘన చరిత్ర, మంచి పేరు ఉంది

## మంత్రివర్యులు కొల్లు రవీంద్ర







మచిలీపట్నం అక్టోబర్ 17: కేడీసీసీ బ్యాంకుకు ఎంతో ఘన చరిత్ర, మంచి పేరు ఉందని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం కృష్ణా జిల్లాలోని మండల కేంద్రమైన మోపిదేవిలో 1.10 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నూతన భవనాన్ని మంత్రివర్యులు అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్, కేడీసీసీ బ్యాంకు చైర్మన్, సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ లతో కలిసి ప్రారంభించారు. అనంతరం మేనేజరు, స్ట్రాంగ్, రికార్డు గదులను వారు ప్రారంభించి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రివర్యులు మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధులు భోగరాజు పట్టాభి సీతారామయ్య 1915 వ సంవత్సరంలో రైతుల భాగస్వామ్యంతో కృష్ణ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ను ఏర్పాటు చేశారన్నారు. అలాగే వారి చొరవతో ఆంధ్ర బ్యాంకు, ఎల్ఐసి ఏర్పాటు కాబడ్డాయన్నారు. ఈ కేడీసీసీ బ్యాంకుకు కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలో 57 శాఖలు కలిగి 531 సొసైటీలు అనుసంధానమై ఉన్నాయన్నారు. రైతులకు ఏ కష్టం వచ్చినా కేడీసీసీ బ్యాంకు అన్ని విధాల అండగా ఉండి ఆదుకోవడంలో మంచి గుర్తింపు తెచ్చుకుందన్నారు. ఈ బ్యాంకు గొప్పగా సేవలు అందిస్తుందని, పంట రుణాలు, బంగారు రుణాలు, పిల్లల చదువుకు రుణాలు అందించడంతోపాటు ఏటీఎంలు కూడా ఏర్పాటు చేస్తుందన్నారు. జాతీయ బ్యాంకుల తరహాలో కేడీసీసీ బ్యాంకు నడుస్తోందని, మంచిగా లాకర్లు, కౌంటర్లు ఏర్పాటు చేశారని మరింత మెరుగ్గా రైతులకు, వినియోగదారులకు సేవలు అందించి అభివృద్ధి చెందాలన్నారు. సహకార రంగానికి ఆర్థికంగా బలోపేతం చేయడంలో తన వంతు కీలకపాత్ర పోషిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి ఉత్తమ బ్యాంకు పురస్కారం కూడా అందుకుందన్నారు. ఈ బ్యాంకులో పెద్ద ఎత్తున 3,200 కోట్ల రూపాయల డిపాజిట్లు ఉన్నాయన్నారు. ఇటీవలి కృష్ణ నది వరదల సందర్భంగా 20 లక్షల రూపాయలను బ్యాంకు యాజమాన్యం ముఖ్యమంత్రి సహాయ నిధికి( సీఎంఆర్ఎఫ్) అందించిందన్నారు. గత 5 ఏళ్లుగా సహకార వ్యవస్థ నిర్వీర్యమైపోయిందన్నారు. ఆ వ్యవస్థను కూటమి ప్రభుత్వం తిరిగి నిలబెట్టడానికి అన్ని విధాలా కృషి చేస్తుందన్నారు. సహకార సంఘాలు, బ్యాంకుల నిర్వహణకు త్వరలో పాలకవర్గాలు ఏర్పాటు కాబోతున్నాయన్నారు. తద్వారా రైతాంగానికి ఎంతో మేలు జరగనుందన్నారు. అంతకుమునుపు అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య అమృత హస్తాలతో సహకార రంగంలో కేడీసీసీ బ్యాంకు తదుపరి ఆంధ్ర బ్యాంకు ప్రారంభించారన్నారు. ఆ బ్యాంకులు అత్యద్భుతంగా వినియోగదారులకు సేవలు అందిస్తున్నాయన్నారు. కార్యక్రమేనా ఆంధ్ర బ్యాంక్ యూనియన్ బ్యాంకులో విలీనమైందన్నారు. ఆనాటి నుండి నేటి వరకు కేడీసీసీ బ్యాంకు రాష్ట్రంలోనే ఎప్పుడు లాభాల బాటలోనే నడుస్తుందన్నారు. కేడీసీసీ బ్యాంకు సేవలందించడంలో ఎప్పుడు అగ్రగామిగా ఉండడంతో ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపు ఇస్తోందని, ఆప్కాబ్ అధ్యక్షులుగా ఎప్పుడు కృష్ణా జిల్లా వారినే నియమించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ నేపథ్యంలో మోపిదేవిలో కేడీసీసీ నూతన భవనం ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ బ్యాంకు రైతాంగానికి అన్ని విధాల సహకారం అందించి అండగా నిలవాలని కోరుతున్నానన్నారు. కూటమి ప్రభుత్వం సహకార వ్యవస్థను పరిపుష్టం చేయడానికి పూనుకుందన్నారు. కేడీసీసీ బ్యాంకు అద్వితీయమైన బ్యాంకుగా గుర్తింపు పొందాలని, భవిష్యత్తు కూడా బాగుండాలని కోరుకుంటున్నానన్నారు. ఈ సందర్భంగా మంత్రి, శాసనసభ్యులు, బ్యాంకు చైర్మన్ లకు బ్యాంకు సీఈవో జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కే డి సి సి బ్యాంకు సీఈవో ఏ శ్యామ్ మనోహర్, జనరల్ మేనేజర్ చంద్రశేఖర్, ఏజీఎం జి సూర్య ప్రకాష్ రావు, బ్రాంచ్ మేనేజర్ సయ్యద్ సల్మా సుల్తానా, తహసీల్దారు శ్రీవిద్య, జడ్పిటిసి మెడబలిమీ మల్లికార్జున రావు, ఎంపీపీ రావి దుర్గ వాణి,ఎంపీటీసీ కొమ్మ పవన్ కుమార్, సర్పంచ్ నందిగం వేద రాణి, పలువురు బ్యాంకు ఉద్యోగులు తదితర అధికారులు అనధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం మోటార్ ఇంజన్లకు నష్టపరిహారం ఇవ్వాలి



గుడివాడ,తెలంగాణ ముచ్చట్లు : బుడమేరు వరదల్లో నష్టపోయిన మోటర్ ఇంజన్లకు నష్టపరిహారం ఇవ్వాలని, రైతు సంఘము ఆధ్వర్యంలో పుట్టగుంట సచివాలయం వద్ద సెక్రటరీకి మెమరాండం ఇవ్వడం జరిగింది. పుట్టగుంట పరిధిలో 35 మంది రైతులు మోటర్లు వరదల వలన నష్టపోవడం జరిగిందని, ప్రభుత్వం మోటార్లకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసారు.ఒక్కొక్క మోటర్ రిపేర్ చేపించాలంటే సుమారు 12000 రూపాయలు ఖర్చు అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు, కాబట్టి ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలోరైతు సంఘం నాయకుడు నీలం మురళీకృష్ణ రెడ్డి, స్థానికులు లచ్చిరెడ్డి ప్రసాదు, పరుచూరి కోటేశ్వరరావు, పామర్తి వెంకటేశ్వరరావు, తోట రంగారావు, తదితరులు పాల్గొన్నారు.


# పసికందు ప్రాణాలు కాపాడిన ప్రజా దర్బార్....

## - ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య



జగ్గయ్యపేట టౌన్ అక్టోబర్ 17 జగ్గయ్యపేట పట్టణం సత్యనారాయణపురం నకు చెందిన చదల వెంకట మహేశ్వర రావు దంపతులకు పుట్టిన శిశువుకు 14 రోజులకే జ్వరం వచ్చి ప్రాణాపాయ స్థితి ఏర్పడింది. గత నెలలో శిశువుకు ప్లేట్లెట్స్ పడిపోయి పరిస్థితి విషమించడంతో కొంతమంది సూచన మేరకు మెరుగైన చికిత్సకు విజయవాడలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకువెళ్లారు. చికిత్సకు లక్షల్లో ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉన్న గిరిజన కుటుంబానికి చెందిన మహేశ్వరరావుకు ఏం చేయాలో పాలుపోక గత నెల 28వ తేదీన మంగళగిరిలో తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమానికి వెళ్లి మంత్రి నారా లోకేష్ ని కలిసి ఆదుకోవాలని అభ్యర్థించారు. దీంతో తక్షణమే స్పందించిన మంత్రి నారా లోకేష్ వైద్యానికి అవసరమైన సాయాన్ని ముఖ్యమంత్రి సహాయనిధి (%రూజ% )నుండి అందించి పసికందు ప్రాణాలు నిలిపారు. విజయవాడ వైద్యశాలలో చికిత్స పొందిన పసిబిడ్డ పూర్తి ఆరోగ్యంగా ఇంటికి చేరాడు.ఈ విషయాన్ని తెలుగుదేశం పార్టీ వార్డు ఇన్చార్జ్ పితాని శ్రీనాథ్ ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ఈ రోజు వారి గృహానికి వెళ్లి పసిబిడ్డను చూసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రజా దర్బార్ ద్వారా ఎంతో మంది పేదల కష్టాలు తీరుతున్నాయని అన్నారు.పేదల ఆరోగ్యానికి వరంల ముఖ్యమంత్రి సహాయనిధి నిలుస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ కి ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య కృతజ్ఞతలు తెలిపారు.

# నివాసాల మధ్య వైన్ షాప్ పెట్టడాన్ని నిరసిస్తూ రోడ్డుపై ధర్నా నిర్వహించిన గ్రామస్తులు



గుడివాడ, తెలంగాణ ముచ్చట్లు : గుడివాడ బేతవోలు సెంటర్లోని గుడివాడ విజయవాడ ప్రధాన రహదారి ప్రక్కనే ఉన్న ఒక షాపులో ఈరోజు ఉదయం నూతనంగా మద్యం షాపును ఏర్పాటు చేశారు. వైన్ షాపులో ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ స్థానికులు రోడ్డుపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నివాస గృహాల మధ్యన మద్యం షాపు ఏర్పాటు చేస్తే చుట్టుపక్కల ఉన్న కుటుంబాల వారు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, ఇక్కడే మద్యం తాగి గొడవలు చేస్తారని, ప్రశాంతంగా ఉన్న మా ప్రాంతంలో వైన్ షాపును పెట్టనివ్వమని వారు ఆందోళన నిర్వహించారు. నిన్నటి నుండి ఈ షాపు మరమ్మతులు చేస్తుండగా వేరే వ్యాపారం పెడుతున్నారని అనుకున్నామని, ఈరోజు వైన్ షాపు అని బోర్డు తగిలించి వ్యాపారం ప్రారంభించారని, దీనిని ఎట్టి పరిస్థితుల్లో ఇక్కడ ఏర్పాటు చేయనివ్వమని స్థానికులు తెలిపారు. ఈ సంఘటనతో గుడివాడ విజయవాడ ప్రధాన రహదారిలో సుమారు కిలోమీటర్ దూరం ట్రాఫిక్ స్తంభించింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్ ను క్లియర్ చేశారు.

# అలుగు రోడ్డు సమస్యను పరిష్కరించిన సర్పంచ్




తిరువూరు, తెలంగాణ ముచ్చట్లు : : మండలంలోని లక్ష్మీపురం గ్రామపంచాయతీలో నెల రోజుల క్రితం కురిసిన అకాల వర్షాలకు కొట్టుకుపోయినటువంటి కొత్త లక్ష్మీపురం అలుగు రోడ్డును గ్రామ సర్పంచ్ గొల్లమందల శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం మరమ్మతులు చేయించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బొల్లినేని రాజా , నెక్కడవు శ్రీనివాస్ రావు , వార్డు సభ్యులు రంగారావు, నెక్కడవు నాగేశ్వరరావు , గ్రామస్తులు పాల్గొన్నారు....

శుక్రవారం 17-10-2024

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU TELTEL12273

# నెల్లూరుసిటీలో సోమవారం నుండి3 ఇసుక స్టాక్ పాయింట్లు ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నాం






నెల్లూరు, తెలంగాణ ముచ్చట్లు : నెల్లూరుసిటీలో సోమవారం నుండి3 ఇసుక స్టాక్ పాయింట్లు ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ చెప్పారు. గురువారం నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిధిలోని పెన్నా నది ఎడమవైపున ఇసుక స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేయడానికి రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, జిల్లా కలెక్టర్ ఓఆనంద్ పరిశీలించారు. ప్రస్తుతం జిల్లాలో మూడు స్టాక్ పాయింట్లు ద్వారా6 వేల టన్నుల ఇసుక ఉత్పత్తి అవుతుందన్నారు. సిటీలో మూడు స్టాక్ పాయింట్లు ప్రారంభించడం వల్ల 22 వేల టన్నులు ఇసుక ఉత్పత్తి అవుతుందన్నారు. రాష్ట్రంలో ఇసుక ధరను తగ్గించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నెల్లూరు సిటీలో పెన్నా నదికి ఎడమ వైపున 48వ డివిజన్ లోఒక్కటి 49వ డివిజన్ లో ఒకటి 54 డివిజన్ లో ఒకటి మొత్తము మూడు రీచ్ లను సోమవారం నుండి ప్రారంభించడానికి చర్యలు తీసుకోవలసిందిగా అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. జిల్లాలో ఉత్పత్తి పెరగటం కారణంగా ఇసుక ధరలు తగ్గుతాయని ఆయన చెప్పారు. జిల్లాలో త్వరలో 4 ఇసుక ఓపెన్ రీచ్ లను ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో పెన్నా నదిలో పూడికతీత ద్వారా 22 వేల టన్నులఇసుక ఉత్పత్తిఅవుతుందన్నారు.నెల్లూరు జిల్లాలో ఉత్పత్తి అయిన ఇసుక నెల్లూరు జిల్లాతో పాటు ప్రకాశంజిల్లా, బాపట్ల జిల్లాలో ప్రజల అవసరాల కోసం సరఫరా చేయడం జరుగుతుందన్నారు. నెల్లూరు సిటీ అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని మంత్రి కోరారు. నెల్లూరు నగరంలో గత మూడు రోజులుగా కురిసిన వర్షాల వల్ల ఎక్కడ కూడా ఒక్క చుక్కనీరు నిలబడకుండా చర్యలు తీసుకున్నామన్నారు. నెల్లూరు నగరంలో 54 కోట్ల రూపాయలతో మురుగు కాలువల కూడిక తీయడానికి చర్యలు తీసుకున్నామని మంత్రి చెప్పారు. నగరంలోని రోడ్డు మార్గ మధ్యలోని డివైడర్ల వద్ద ఫ్లెక్సీల తొలగించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. అలాగే గోడల మీద వాల్ పోస్టర్లు కూడా అనుమతి లేకుండా అంటించవద్దని ఆయన అన్నారు. నగరంలో రోడ్లమీద పశువులను వదిలివేయద్దని యజమానులు ఎవరి పశువులు వారే షెడ్యూల్లో ఉండే విధంగా ఏర్పాటు చేసుకోవాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, నగరపాలక సంస్థ కమిషనర్ సూర్య తేజ, నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, రెవిన్యూ డివిజన్ అధికారి అనూష, మండల రెవెన్యూ అధికారి లాజర్, తదితరులు పాల్గొన్నారు.

# పల్లె పండుగతో గ్రామీణాభివృద్ధికి శ్రీకారం

- 82 లక్షలతో అభివృద్ధి పనులకు శంఖుస్థాపన
- రోడ్లు డ్రైన్ల నిర్మాణాలలో నాణ్యతా ప్రమాణాలు పాటించండి
- పల్లెటూళ్లకు పూర్వ వైభవం.
- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



నెల్లూరు, తెలంగాణ ముచ్చట్లు : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సారధ్యంలో పల్లెటూళ్ళు ప్రగతి బాట పట్టనున్నాయని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్లె పండుగ కార్యక్రమంలో పాల్గొనేందుకు మైపాడు గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి పడమర పాళెం మత్స్యకారులు ఘన స్వాగతం పలికారు. మత్స్యకార సంఘాలకు చెందిన పెద్ద కాపులు శాలువాలు, పూల బొకేలతో సన్మానించారు. పడమరపాలెం మత్స్యకార కాలనీలో నిర్మిస్తున్న బంగారమ్మ ఆలయ భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం 10 లక్షల వ్యయంతో మైపాడు గ్రామంలో సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణం , 82 లక్షల రూపాయల వ్యయంతో ఇందుకూరు పేట మండలం లోని వివిధ గ్రామాలలో జరగనున్న అభివృద్ధి పనులకు ఆమె శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఆగష్టు 23 వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన గ్రామసభల ద్వారా తీర్మానాలు చేసి 13 326 గ్రామ పంచాయితీల్లో 4,500 కోట్లతో 30 వేల అభివృద్ధి పనులు చేస్తూ పల్లెలకు పూర్వవైభవం తెచ్చే దిశగా కృషి చేస్తోందన్నారు. కాంట్రాక్టర్ల ప్రమేయం లేకుండా గ్రామస్థులే నాణ్యతా ప్రమాణాలు పాటించి అభివృద్ధి పనులు చేసుకోవాలని సూచించారు. రామాయణాన్ని రచించిన వాల్మీకి మహర్షి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఆమె ధన్యవాదాలు తెలియచేసారు. పల్లె పండుగ పేరిట దశలవారీగా ప్రతి గ్రామానికి ప్రభుత్వ అభివృద్ధి ఫలాలు అందించే కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతి గ్రామానికి సి సి రోడ్లు, మెరుగైన పారిశుధ్య నిర్వహణ కై డ్రైన్లు లాంటి మౌళిక సదుపాయాలను కల్పించే కార్యక్రమమే పల్లె పండుగని వెల్లడించారు. ఓ వైపు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూనే మరో వైపు కనీస వసతులు లేని పల్లెటూళ్లకు మౌలిక కల్పిస్తూ సంక్షేమంతో పాటు అభివృద్ధి సాధించగల సామర్థ్యం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేంద్ర రెడ్డి, పంచాయతీ రాజ్ ఏ ఇ ఖాదర్ మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

## భారతజాతి మొత్తాన్ని ఐక్యంగా ఉంచే

# గొప్ప భావజాలం గల మహాకావ్యం రామాయణం

**- జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్**





నెల్లూరు,తెలంగాణ ముచ్చట్లు : భారతజాతి మొత్తాన్ని ఐక్యంగా ఉంచే గొప్ప భావజాలం గల మహాకావ్యం రామాయణమని జిల్లా కలెక్టర్ ఒ. ఆనంద్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో వాల్మీకి మహర్షి జయంతిని జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

తొలుత బిసి నాయకులు వెంట రాగా జ్యోతి ప్రజ్వలన అనంతరం మహర్షి వాల్మీకి చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాలంకరణ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారతజాతి మొత్తాన్ని ఐక్యంగా ఉంచే గొప్ప మహాకావ్యం రామాయణమని, అటువంటి సుందర కావ్యాన్ని రచించిన వాల్మీకి మహర్షి జయంతిని రాష్ట్ర పండుగగా జరుపుకోవడం సంతోషకరమన్నారు. రామాయణాన్ని ప్రతి ఒక్కరూ చిన్నప్పటినుండి వింటూ ఉంటారని, కానీ జీవితంలో ఎదిగే కొద్దీ రామాయణ మహాకావ్య స్ఫూర్తి అందరికీ అర్థమవుతుందన్నారు. భారతదేశంలోని ప్రతి గ్రామంలో రామాయణ ఇతిహాస గాథ విన్పిస్తూ ఉంటుందన్నారు. దేశమంతటిని ఒకటిగా నిలిపే శక్తి రామాయణ మహాకావ్యానికే ఉందన్నారు. మరో వెయ్యేళ్ళు గడిచినప్పటికీ రామాయణ మహాకావ్యం ప్రజల మనసుల్లో ఎప్పటికీ నిలిచి ఉంటుందన్నారు. అదేవిధంగా ప్రభుత్వ వసతి గృహాల్లో ఎక్కువగా పేద పిల్లలు ఉంటారని, అటువంటి వసతి గృహాలను అభివృద్ధి చేయడానికి వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ద్వారా కృషి చేస్తామన్నారు. ఏడు ఖండాలుగా విభజించిన రామాయణ మహా కావ్యం ఎంతో సుందరమైందని, సీతారాముల గుణగణాలను స్థుతిస్తూ బీసీ నాయకులు చల్లా వెంకటసుబ్బయ్య రామాయణ శ్లోకాలను వీనుల విందుగా ఆలపించారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ లవన్న, వాల్మీకి బోయ సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ చంచల్ బాబు యాదవ్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఇంచార్జి అధికారి ప్రసూన, సాంఘిక సంక్షేమ శాఖ డిడి శ్రీనివాసులు, బీసీ నాయకులు బూదాటి రాధాకృష్ణయ్య, జనార్ధన్, నాగరాజారావు, వెంకటసుబ్బయ్య, హజరతయ్య, కోటేశ్వరరావు, మస్తానయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఇక అభివృద్ధి పనులపై దృష్టి పెడతాం

- ఆత్మకూరు అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తా
- రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా సీఎం సరికొత్త పాలసీలను తీసుకొస్తున్నారు
- పారదర్శకంగా మద్యం, ఉచిత ఇసుక పాలసీలు
- మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి
- ఆత్మకూరు రూరల్, ఏఎస్ పేట మండలాల నాయకులతో విస్తృత సమావేశం

నెల్లూరు, తెలంగాణ ముచ్చట్లు : గడిచిన మూడు నెలలుగా గత ప్రభుత్వ తప్పులను సరిదిద్దుకుంటూ, అప్పుల భారాన్ని భరిస్తూ... రాష్ట్రాన్ని గాడిన పెడుతున్నామని, ఇక నుంచి అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఉదయం నెల్లూరు నగరంలోని క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరు రూరల్, అనుసముద్రంపేట మండలాల పార్టీ ముఖ్య నాయకులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించిన మంత్రి, ఆత్మకూరు నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ సభ్యత్వ నమోదుపై నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీ నాయకులు, కార్యకర్తల సూచనలు, సలహాల మేరకు అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తామని చెప్పారు. రాష్ట్రంలో ఐదు నియోజకవర్గాలను సభ్యత్వ నమోదుకు ముఖ్యమంత్రి ఎంపిక చేసి అబ్జర్వర్లను నియమించారని,అందులో మన ఆత్మకూరు నియోజకవర్గం ఎంపిక కావడం మనందరికి గర్వకారణంగా మంత్రి చెప్పారు. ప్రతి ఒక్క కార్యకర్త కూడా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని, పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రెండేళ్ల పార్టీ సభ్యత్వానికి 100 రూపాయలు ఆన్లైన్ లో చెల్లించాలని, సభ్యత్వం పొందిన ప్రతి ఒక్క కార్యకర్త సంక్షేమానికి పార్టీ భరోసాగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. అన్ని మండలాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సభ్యత్వాన్ని పూర్తి చేస్తామని మంత్రి చెప్పారు.

**ఆత్మకూరు అభివృద్ధికి పెద్దపీట....చకచకా అభివృద్ధి పనులు : మంత్రి ఆనం**

ఆత్మకూరు నియోజకవర్గంలో రాబోయే ఐదేళ్లలో పరిశ్రమలు, ఇరిగేషన్ ప్రాజెక్టుల ఏర్పాటు, వివిధ రెసిడెన్షియల్ కళాశాలల ఏర్పాటు, స్కిల్ కళాశాల ఏర్పాటు, నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు గొప్ప సంకల్పంతో పనిచేస్తున్నట్లు మంత్రి చెప్పారు. ఆత్మకూరులో ఈ ఏడాది నుంచి బీసీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలను ప్రారంభిస్తున్నామని చెప్పారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఆలయాల మరమ్మతులకు 5 లక్షల వరకు నిధులు మంజూరు చేస్తామని, నాయకులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆలయాల అభివృద్ధికి ముందుకు రావాలన్నారు. రూ 50 వేల లోపు ఆదాయం ఉన్న ఆలయాల్లో ధూప దీప నైవేద్యాలకు రూ 10వేలు ఈ నెల నుంచి మంజూరు చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. గ్రామాల్లో పెద్ద ఎత్తున ఉపాధి హామీ పనులను మొదలుపెట్టనున్నామని, నాయకులందరూ గ్రామాలకు అవసరమైన అభివృద్ధి పనులను సూచించాలని చెప్పారు. అలాగే మండలానికి ఒకటిన్నర కోటి రూపాయలు సీసీ రోడ్లకు ఉపాధి హామీ పనులు మంజూరయ్యాయని చెప్పారు. అదనంగా మరో ఒకటిన్నర కోటి రూపాయలు నిధులను కూడా మంజూరు చేయించేందుకు చర్యలు చేపట్టినట్లు మంత్రి వివరించారు. రూ. 5 కోట్లతో మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులు కూడా ప్రారంభించేందుకు చర్యలు చేపట్టినట్లు మంత్రి చెప్పారు. ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్ ల పై చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. అలాగే రేషన్ షాప్ దుకాణాల్లో కూడా అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఆత్మకూరులోని నారంపేట ఇండస్ట్రియల్ పార్కులో పరిశ్రమల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, ఇందులో స్థానిక యువత పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని మంత్రి చెప్పారు. తన అభ్యర్థన మేరకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నియోజకవర్గంలోని ప్రతి మండలానికి 50 గురుకులాలను మంజూరు చేశారని చెప్పారు. జిల్లాలో ఎంతో ప్రసిద్ధి చెందిన అనుమసముద్రంపేట దర్గాను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు జిల్లా ఇన్చార్జి మంత్రి ఎన్ఎం ఫరూక్ దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే ప్రత్యేక ప్రణాళిక రూపొందించనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు.

**రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి సరికొత్త నిర్ణయాలు తీసుకుంటున్న సీఎం : మంత్రి**

రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి అహర్నిశలు శ్రమిస్తున్నారని మంత్రి చెప్పారు. రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు సరికొత్త నిర్ణయాలు తీసుకుంటున్నారన్న మంత్రి, పారదర్శకంగా టెండర్ల ద్వారా లాటరీ పద్ధతిలో మద్యం షాపులను కేటాయించామన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా లేనివిధంగా సరికొత్త మద్యం పాలసీని తీసుకొచ్చి.... పేదవాడి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని నాణ్యమైన అన్ని బ్రాండ్ల మద్యాన్ని క్వార్టర్ బాటిల్ రూ. 99 కే అందుబాటులో ఉంచుతున్నట్లు మంత్రి చెప్పారు.

# సినిమా న్యూస్



# బర్త్ డే బ్యూటీ.. మూడు భాషల్లోనూ మొదట అట్టర్ ఫ్లాప్



నటుడు సురేష్ కుమార్, నటి మేనక వారసురాలు అయిన కీర్తి సురేష్ టాలీవుడ్, కోలీవుడ్‌లో ప్రస్తుతం టాప్ స్టార్ హీరోయిన్‌గా వరుస సినిమాలు చేస్తున్న విషయం తెల్సిందే. హీరోయిన్‌గా ఈమె చేసిన మహానటి సినిమా పాన్ ఇండియా రేంజ్‌లో భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. ఆ సినిమా వల్ల పాన్ ఇండియా స్టార్ హీరోయిన్ ఇమేజ్ సొంతం చేసుకోవడం మాత్రమే కాకుండా నటిగా అన్ని భాషల్లోనూ సినిమాలు చేస్తూ దూసుకు పోతుంది. ప్రస్తుతం ఇండియాలో అత్యధిక క్రేజ్ ఉన్న హీరోయిన్స్ జాబితాలో ముందు వరుసలో ఉన్న కీర్తి సురేష్ కెరీర్ ఆరంభంలో మాత్రం తీవ్రమైన ఒడిదొడుకులు ఎదుర్కొంది.నేడు కీర్తి సురేష్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఆమెకు సంబంధించిన పలు విషయాలను సోషల్ మీడియా ద్వారా అభిమానులు షేర్ చేసుకుంటూ ఉన్నారు. ఆ విషయాలు పక్కన పెడితే కెరీర్ ఆరంభంలో కీర్తి సురేష్ ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నారు అనే విషయం గురించి ఇప్పుడు చూద్దాం. కీర్తి సురేష్ తల్లితండ్రి ఇద్దరూ ఇండస్ట్రీకి చెందిన వారే అవ్వడంతో బాల నటిగానే ఇండస్ట్రీలో అడుగు పెట్టింది. కెరీర్ ఆరంభంలో అందరి దృష్టిని ఆకర్షించింది. మలయాళంలో కీర్తి సురేష్ మొదటి సినిమా చేసింది. మోహన్‌లాల్ హీరోగా నటించిన ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద బొక్క బోర్లా పడింది. దాంతో హీరోయిన్‌గా మొదటి ఫ్లాప్ ను కీర్తి సురేష్ మూట కట్టుకుంది. మోహన్‌లాల్ సినిమాలో నటించడానికి ముందు రెండు మూడు సినిమాలు ప్రారంభం అయి కొన్నాళ్ల షూటింగ్ తర్వాత ఆగిపోయాయి. దాంతో కీర్తి సురేష్ ను ఐరెన్ లెగ్ అంటూ కొందరు విమర్శించడం మొదలు అయింది. అదే సమయంలో తమిళంలో ఒక సినిమా చేసింది. ఆ సినిమాతో తమిళ ప్రేక్షకులు కీర్తి సురేష్ ను హీరోయిన్‌గా అంగీకరించలేదు. ఆ సినిమా సైతం అట్టర్ ఫ్లాప్ అయింది. దాంతో ఐరెన్ లెగ్ ముద్ర మరింతగా పడి పోయింది. దాంతో కీర్తి సురేష్ టాలీవుడ్ లో సినిమా ప్రయత్నం చేసింది. తెలుగు లో కీర్తి సురేష్ రెండు జళ్ల సీత లో నటించింది. ఆ సినిమా సైతం వాయిదా పడుతూనే వచ్చింది. ఆ సినిమా విడుదల కాకపోవడంతో కీర్తి సురేష్ కి మూడు ఇండస్ట్రీలోనూ నిరాశే మిగిలింది. అసలు ముందు ముందు అయినా కీర్తి సురేష్ హీరోయిన్‌గా నిలదొక్కుకునే అవకాశం ఉందా అంటూ కొందరు అనుమానాలు వ్యక్తం చేశారు. కీర్తి సురేష్ హీరోయిన్ గా పనికి రాదని, ఆమెను ఐరెన్ లెగ్ అంటూ విమర్శించిన వారే మహానటి సినిమాతో అభిమానులు అయ్యారు. అంతకు ముందు ఆ తర్వాత సైతం కీర్తి సురేష్ నుంచి మంచి సినిమాలు వచ్చాయి. జాతీయ అవార్డ్ స్థాయి నటి కీర్తి సురేష్ అంటూ ఇప్పుడు ప్రశంసలు దక్కించుకుంటుంది. అందుకే కీర్తి సురేష్ పేరుకు తగ్గట్లుగా కీర్తిని దక్కించుకుని పాన్ ఇండియా రేంజ్‌లో దూసుకు పోతుంది. ఒకప్పుడు అట్టర్ ఫ్లాప్ హీరోయిన్ గా అనిపించుకున్న కీర్తి సురేష్ ఇప్పుడు బెస్ట్ హీరోయిన్ గా ప్రశంసలు దక్కించుకుంటుంది. ముందు ముందు మరిన్ని హిట్స్ కీర్తి సురేష్ కి దక్కాలని కోరుకుంటూ హ్యాపీ బర్త్ డే టు కీర్తి సురేష్.

# వీదేశీ అందాల్నే హీటెక్కిస్తోన్న హాట్ భామలు!



టైమ్ దొరికితే వెకేషన్లకు చెక్కేయడం హీరోయిన్లకు ఓ హాబీ లాంటింది. ఈ విషయంలో భామామణులు ఎక్కడా తగ్గరు. షూటింగ్ నుంచి ఒక్కసారిగా రిలాక్స్ మోడ్ లో కి జారుకుంటారు. అందులోనూ బర్త్ డేలు...స్పెషల్ అకేషన్స్ లాంటివి ఏవైనా వచ్చాయంటే? అస్సలు ఆగలేరు. బాలీవుడ్ హీరోయిన్లకు వెకేషన్ స్పాట్ ఏది? అంటే ఠక్కున మాల్దీవులే గుర్తొస్తుంది. అందమైన ఐలాండ్ లో వాలిపోయి వారం-పది రోజులు ఎంజాయ్ చేస్తారు. అలాగని ప్రపంచంలో మిగతా అందాల్ని ఆస్వాదించరని కాదు. ఇంకాస్త టైమ్ ఎక్కువగా ఉంటే సుదూర ప్రాంతాలకు వెళ్లిపోతుంటారు. ఓసారి విదేశాల్లో ఉన్న ఆ భామలెవరో చూద్దాం. ముంబై బ్యూటీ పూజాహెగ్డే శ్రీలంక అందాల్ని ఆస్వాదిస్తోంది. శ్రీలంక జంగిల్ రిసార్ట్స్ లో బర్త్ డేని సోలోగా ఆస్వాదిస్తోంది. అక్కడే కేక్ కట్ చేసి సెలబ్రేషన్ చేసుకుంది. ఇన్ స్టాలో ఫోటోలు చేసి తానెంత చిల్ అవుతుందో చెప్పకనే చెప్పింది. ఇక మోహ్రీన్ పిర్జాదా కి నటిగా అవకాశాలు లేకపోవడంతో దేశంలోనే కనిపించలేదు. విదేశాల్లో ఎక్కువగా స్వదేశంలో ఎక్కువగా ఉంటుంది. విదేశాల్లో కొత్త కొత్త ప్రదేశాలు చుట్టేస్తోంది. నెలకో దేశంలో ఉంటోంది. ప్రస్తుతం లండన్ లో ఉంది. అక్కడ నుంచే తన అప్ డేట్స్ అన్నీ ఇస్తోంది. ఆమెతో పాటు మామ్ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే యువ నాయిక కావ్యాథాపర్ కూడా రిలాక్స్ మోడ్ లోకి జారుకుంది. మొన్నటి వరకూ %-%విశ్వం%-% సినిమా పనుల్లో ఉన్న అమ్మడు రిలీజ్ అనంతరం బాలి చెక్కేసింది. ప్రస్తుతం ఇండోయేషియా అందాల్లో సేద తీరుతోంది. వచ్చే వారం ఇండియాకి రానుంది. అలాగే అందాల త్రిష కూడా హాలీడే ట్రిప్ లో ఉంది. స్నేహితుల్ని వెంటేసుకుని మొరాకో చెక్కేసింది. అక్కడ ప్రకతి అందాల మధ్య సేద తీరుతోంది. వర్ష బొల్లమ్మా అబుదాబిలో.. కావ్యా కల్యాణ్ రామ్ టర్కీలో ఇంకా కొంత మంది భామలు విదేశీ వెకేషన్ లోనే ఉన్నారు.

# డెకాయిట్.. శ్రుతి ప్లేస్ లో ఎవరంటే?



యువ కథానాయకుడు అడివి శేష్ నటిస్తున్న మూవీల్లో ఒకటి డెకాయిట్. ఆయన హీరోగా ఇప్పటికే వచ్చిన క్షణం, గూఢచారి వంటి చిత్రాలకు సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరించిన షానీల్ డియో.. డెకాయిట్ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. తెలుగు, హిందీలో ద్విభాషా చిత్రంగా సుప్రియ యార్లగడ్డ రూపొందిస్తున్నారు. గత ఏడాది చివర్లో మూవీ టైటిల్ టీజర్ ను మేకర్స్ రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. డెకాయిట్ టైటిల్ టీజర్.. సినీ ప్రియుల నుంచి మంచి రెస్పాన్స్ అందుకుంది. జూలియెట్ ఎన్నేళ్లయింది మనం కలిసి అనే డైలాగ్? తో అడివి శేష్ ఎంట్రీ ఇచ్చారు. అల్లర్లు జరిగిన ప్రాంతంలో గన్ పట్టుకొని శ్రుతి కనిపించారు. ఆ తర్వాత శేష్, శ్రుతి ఇద్దరూ ఒకరికొకరు తుపాకులు ఎక్కు పెట్టుకుంటారు. తుపాకీ ఫైర్ చేసినట్టు, కింద పడినట్టు బ్యాక్ గ్రౌండ్ సౌండ్ వచ్చింది. ఇద్దరు మాజీ లవర్స్ తప్పని పరిస్థితుల్లో కలిసి దోపిడీలు చేయడమే డెకాయిట్ మూవీ ప్రధాన బ్యాక్? డ్రాప్ గా క్లారిటీ వచ్చింది. మొత్తంగా ఇంటెన్స్, లవ్ యాక్షన్ చిత్రంగా డెకాయిట్ తెరకెక్కిస్తున్నట్లు క్లియర్ గా అర్థమవుతుంది. ఇప్పటికే సగానికిపైగా షూటింగ్ జరిగినట్లు తెలుస్తోంది. అయితే రీసెంట్ గా సినిమా నుంచి హీరోయిన్ శ్రుతి హాసన్ తప్పుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. డేట్స్ ఇష్యూ కారణంగా ఆమె.. ఆ నిర్ణయం తీసుకున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే శ్రుతి.. మేకర్స్ కు కొన్ని రోజుల డేట్స్ ఇచ్చారట. కానీ డైరెక్టర్ షానీల్ డియో.. మెడికల్ ఎమర్జెన్సీ వల్ల అమెరికా వెళ్లారట. దీంతో డేట్స్ అడ్జెస్ట్ చేసుకోలేక శ్రుతి హాసన్.. డెకాయిట్ నుంచి తప్పుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు మరో స్టార్ హీరోయిన్ ను డెకాయిట్ మేకర్స్ సంప్రదించగా.. ఆమె ఓకే చెప్పారట. త్వరలోనే సెట్స్ లో అడుగుపెడతానని తెలిపినట్లు సమాచారం. మరికొద్ది రోజుల్లో మేకర్స్.. కొత్త హీరోయిన్ పేరు అఫీషియల్ గా అనౌన్స్ చేయనున్నారని వినికిడి. స్పెషల్ పోస్టర్ ను కూడా రిలీజ్ చేయనున్నట్లు టాక్ వినిపిస్తోంది.

# త్రిప్తి.. తృప్తి.. సంతృప్తి..!



గ్లామర్ ఫీల్డ్ లో ఎన్నాళ్ల నుంచి పనిచేస్తున్నాం అన్నది కాదు ఎప్పుడు క్రేజ్ తెచ్చుకున్నాం అన్నది ఇంపార్టెంట్. అలాంటి విషయాలు తమకు రావాల్సిన గుర్తింపు లేట్ గా వచ్చిన వారికి బాగా అర్థమవుతుంది. అలాంటి వారిలో కచ్చితంగా బాలీవుడ్ అందాల భామ త్రిప్తి డిమ్రి ఉంటుంది. యానిమల్ సినిమాలో ఛాన్స్ ఆమె ఫేట్ మార్చేసిందని చెప్పొచ్చు. అంతకుముందు కూడా త్రిప్తి సినిమాలు, వెబ్ సీరీస్ లు చేసింది కానీ ఆమెకు సరైన గుర్తింపు రాలేదు. కానీ ఎప్పుడైతే యానిమల్ రిలీజైందో బీ టౌన్ ఆడియన్స్ అంతా త్రిప్తి పేరునే జంపించేలా చేసింది. ఆ సినిమాలో హీరోయిన్ గా నటించిన రష్మిక కన్నా త్రిప్తికే ఎక్కువ పాపులారిటీ వచ్చిందని చెప్పొచ్చు. ఇక ఒక్కసారి లైం లైట్ లోకి వచ్చాక ఆఫర్లు వాటంతట అవే వచ్చేస్తాయి. అందులో భాగంగానే త్రిప్తి వరుస అవకాశాలు అందుకుంటుంది. యానిమల్ తర్వాత తన కెరీర్ పరంగా వేగాన్ని పెంచుకున్న త్రిప్తి సినిమాల సక్సెస్ రేటు ఎలా ఉన్నా తన పేరు వినిపించేలా చేసుకుంటుంది. ఇక సినిమా ఫలితాలు ఎలా ఉన్నా వాటితో పాటు సోషల్ మీడియా ఫోటో షూట్స్ తో కూడా త్రిప్తి ఇంప్రెస్ చేస్తుంది. తన మార్క్ గ్లామర్ షో చేస్తూ త్రిప్తి తన ఫాలోవర్స్ ని సంతృప్తి చెందేలా చేస్తుంది.

EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY BOLLEPAKA RAJESH,PRINTED AT AMULYA PUBLICATIONS & PRINTERS GRAPHICS,H-NO: 2-19/1,VILLAGE & POST THATIKAYALA,DHARMASAGAR MANDAL,HANUMAKONDA DIST,TELANGANA STATE-506151."PUBLISHED AT H.NO: 2-19/1,VILLAGE & POST THATIKAYALA, DHARMASAGAR MANDAL,HANUMAKONDA DIST,TELANGANA STATE-506151.EDITOR : BOLLEPAKA RAJESH,RNI: TELTEL/2023/88710,"CELL:9493669669, MAIL ID:telanganamuchatlu.in@gmail.com,Website:telanganamuchatlu.in